بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحْمَدُهٗ وَنُصَلِّیْ عَلٰی رَسُوْلِهِ الْکَرِیْمِ     وَعَلٰی عَبْدِهِ الْمَسِیْحِ الْمَوْعُوْد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్

**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

# బదర్

తెలుగు వార పత్రిక

Weekly **BADAR** Qadian **Telugu**

సంపుటి 5

సంచిక 50

వార్షిక చందా 500/-రూ॥

www.akhbarbadrqadian.in

**10 డిసంబర్ 2020, 24 రబీఉస్సాని 1442, 10 ఫతహ్ 1399.**


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! (ఆమీన్).

اَللّٰھُمَّ اَیِّدْ اِمَامَنَا بِرُوْحِ الْقُدُسِ
وَبَارِکْ لَنَا فِیْ عُمْرِهٖ وَاَمْرِهٖ

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَمَنۡ اَحۡسَنُ دِیۡنًا مِّمَّنۡ اَسۡلَمَ وَجۡہَہٗ لِلّٰہِ وَہُوَ مُحۡسِنٌ وَّاتَّبَعَ مِلَّۃَ اِبۡرٰہِیۡمَ حَنِیۡفًا ؕ وَاتَّخَذَ اللّٰہُ اِبۡرٰہِیۡمَ خَلِیۡلًا (النساء:126)

అనువాదం: అల్లాహ్ శరణు పొందిన వాని కంటే, మేలు చేయువాని కంటే ధర్మజ్ఞుడైన ఇబ్రాహీమ్ మతమును అనుసరించు వానికంటే ఉత్తమ విశ్వాసి ఎవరుండ గలడు?. అల్లాహ్ ఇబ్రాహీమ్‌ను స్నేహితుడిగా చేసికొని యుండెను.

(నిసా: 126).

## ఏ వైద్యుడు ఫలాన మందు తప్పకుండా ప్రయోజనంను చేకూర్చుతుందని వాగ్దానం చేయలేడు. ఒకవేళ అలా ప్రయోజనాన్ని చేకూర్చినచో మరి ప్రజలు ఎందుకు మృతి చెందుతున్నారు.

### ఉపదేశము: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

పరికరాలను ఉయెగించుకోవడం మన ధర్మశాస్త్రము దృష్ట్యా తప్పుకాదు. మేము ఔషదములను వాడవచ్చునా? అని ఒకరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రశ్నించగా, నిస్సంకోచముగా వాడవచ్చును, ఔషదము లేకుండా ఏ జబ్బు లేదు అని హుజూర్ (స) సమాధానం ఇచ్చారు. అవును ఇది నూటికి నూరు శాతం సత్యమే. కాని ఏ నాటు వైద్యుడైనా లేదా నేటి వైద్యుడైన ఫలాన మందు తప్పకుండా ప్రయోజనంను చేకూర్చుతుందని వాగ్దానం చేయలేడు. ఒకవేళ అలా ప్రయోజనాన్ని చేకూర్చినచో మరి ప్రజలు ఎందుకు మృతి చెందుతున్నారు. అందుకే చికిత్స చేయువారు, వైద్యులు ధార్మికతను అలవర్చుకోవాలి. వైద్యంతో పాటు దుఆలు కూడ చేయాలి. ఏకాంతంలో దుఆలు చేయాలి. అహంకారమును ప్రదర్శించిన వైద్యులను అల్లాహ్ తాలా అవమానానికి గురి చేశాడు. ఒక చోట ఇలా వ్రాయబడింది: జాలినూస్ నీరుగా మలవిసర్జన చేయు జబ్బుకు చికిత్స చేయుటలో ప్రావీణ్యుడు. కాని దైవ విధి చూడండి. చివరికి అతడు కూడ ఆ జబ్బుకే గురై మరణించడం జరిగింది. ఆ విధముగా కొంత మంది వైద్యులు అవమానానికి, మరి కొంత మంది వైద్యులు అవహేళనకు గురి ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోయారు.

ఇక్కడ ప్రస్తావించడంలో గల నా ఉద్దేశమే మనగా, అల్లాహ్ తాలా వారి వాగ్ధానాల వాస్తవికతను బహిర్గతం చేశాడు. పనికి మాలిన పొగడ్తల ఆంతర్యమును బహిర్గతం చేశాడు. ఎవరెవరు ఏ ఏ వాగ్ధానాలు చేశారో వాటికే బలైపోయారు. కావున ఏ విషయంలో వాగ్ధానాలు చేయకూడదని అర్ధమవుతుంది. మా దివంగత తండ్రి గారు కూడ ప్రఖ్యాత వైద్యులు. సుమారు 50 సంవత్సరాల అనుభవం గలదు. వాస్తవం కూడ ఇదే. వాటి వలన దేవుని గృహము ఖాళిగా ఉంటుంది. అందుకే దేవుని వైపు శ్రద్ధ చూపువారు అదృష్ట వంతులు. కష్టాలు వచ్చినప్పుడు హెచ్చులు చేయకూడదు. దైవాన్ని కాకుండా ఇతరులపై భరోసాను పెంచుకోకూడదు. ఒక్కొక్కసారి చిన్న చిన్న జబ్బులే భయంకర రూపాన్ని దాల్చుతాయి. కొన్ని సార్లు గుండెకు చికిత్స చేస్తుండగా మెదడు సమస్యాత్మకముగా మారుతుంది. కొన్ని సందర్భాలలో చల్లటి స్వభావంగా భావించి చికిత్స ప్రారంభించగా వేడి స్వభావం బహిర్గతమవుతుంది. ఎవరు వాటిని నిర్ధారించగలరు. అందుకే కేవలం దేవునిపైనే భరోసా పెంచుకోవలెను. ఈ భూమ్యాకాశముల ప్రాణులను ఎవరు లెక్కించ గలరు. అదే విధముగా జబ్బులను ఎవరు ఊహించగలరు. కంటి జబ్బులే సుమారు 3వేలకు పైగా ఉన్నట్లు వ్రాసారు.

## స్వర్గంలో నివాసం ఉండే వారందరు ఒకరి ఆధ్యాత్మికత ప్రగతికి మరొకరు సహకరించు కుంటారు.

వలహుం ఫీహా అజ్‌వాజున్ ముతహ్హరతున్ (బఖ్రాహ్: 26) ఈ సూక్తిని విశ్లేషిస్తూ సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా ఈ విధముగా తెలిపారు:

వలహుం ఫీహా అజ్‌వాజున్ ముతహ్హరతున్ వారికి అచట పవిత్ర భాగసామ్యులు, పరిశుద్ధులైన భార్యలును, పరిశుద్ధులైన భర్తలను ఇవ్వడం జరుగుతుంది. పవిత్ర భాగసామ్యులు అనే అర్థంలో ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేదు. ఎందుకనగా ఈ విధానంలో దాని అర్ధమేమనగా, స్వర్గంలో ఏ విధముగానైతే ఆహారం ఒకరి నొకరు ఆతిథ్యం పుచ్చుకుంటారు, అదే విధముగానే స్వర్గంలో నివాసం ఉండే వారందరు ఒకరి ఆధ్యాత్మికత ప్రగతికి మరొకరు సహకరించు కుంటారు. ఒక విధముగా అంతర్గత, బహిర్గతల పరంగా ప్రతి ఒక్కరు శాంతి, సామరస్యతలతో జీవితాన్ని కొనసాగిస్తారు.

ఒకవేళ భార్య భర్తలు అని అర్థం తీసుకున్నచో ఎందుకనగా అజ్‌వాజున్ స్త్రీ, పురుషులకు ఇరువురికి ఉపయోగించడం జరుగుతుంది. భార్యకు భాగస్వామి భర్త, భర్తకు భాగస్వామి భార్య అవుతారు. కావున ఈ పదానికి ఒక అర్ధమేమనగా, ప్రతి వర్గానికి సమానమైన వర్గము నుండి పవిత్రులను తోడుగా ఇవ్వడం జరుగుతుంది. ఈ భావంలో కూడ ఎలాంటి అభ్యతరం వ్యక్తం కాదు. ఇక్కడ భావమేమనగా, ప్రతి భర్త తన సత్కార్యములతో పాటు తన భార్య సత్కార్యములను కూడ పర్యవేక్షించుకోవాలి. ప్రతి భార్య తన సత్కార్యములతో పాటు తన భర్త సత్కార్యములను పర్యవేక్షించుకోవాలి. ఒకవేళ వారు ఇహలోకంలో కలసి మెలసి ఉన్నట్లుగా పరలోకంలో కూడ కలసి మెలసి ఉండాలని భావించుకున్నచో వారిలో ప్రతి ఒక్కరు మరొకరిని పుణ్యముల వైపు ప్రోత్సహించుకోవాలి.

(తదుపరి సంచికలో).

## ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు

అనువాదం: అల్లాహ్ తాలా మంచిని చెడును రెండింటిని వ్రాసి పెట్టును. ప్రతి ఒక్కరికి స్పష్టముగా తెలియజేయడం కూడ జరిగింది. కావున ఒకవేళ ఎవరైన ఏదేని సత్కార్యము చేయాలని సంకల్పించి మరేదేని కారణంతో చేయలేకున్నను అతనికి ఆ సత్కార్యపు ప్రతిఫలమును పూర్తిగా అందించును. ఒకవేళ అతడు సంకల్పించుకున్న తరువాత ఆ సత్కార్యమును పూర్తి చేసినచో అందుకు ప్రతిఫలముగా అల్లాహ్ తాలా అతనికి 10 నుండి 700 రెట్లు లేదా అంతకన్న ఎక్కువ రెట్లు పుణ్యమును అతని ఖాతాలో జమ చేయును. ఒకవేళ ఎవరైన ఏదేని చేడు చేయాలని తలచి ఆ చెడును తలపెట్ట కుండా ఉన్నచో అతనికి అల్లాహ్ తాలా ఒక సత్కార్యపు పుణ్యఫలమును అందించును, ఆः ఒకవేళ ఎవరైన ఉద్దేశపూర్వకముగా చెడు చేసినచో అతని ఖాతాలో ఒక చెడును వ్రాసి పెట్టును.

(ముస్లిం, కితాబుల్ ఈమాన్).

అనువాదం: దేవున్ని స్మరించువారి ఉదాహరణ, దేవున్ని స్మరించని వారి ఉదాహరణ సజీవులు, నిర్జీవులను పోలినట్లు ఉండును. అనగా స్మరించువారు సజీవులతో సమానం, స్మరించని వారు నిర్జీవులతో సమానం. ముస్లిం కథనములో ఈ విధముగా కూడ గలదు. ఆః హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెల్పిరి. దేవుడు ఆరాధింపబడు గృహములు వెలసిల్లినట్లు, దేవుడు ఆరాధింపబడని గృహములు వెలబోయినట్లు పోలి ఉండును.

(బుఖారి కితాబుద్దావత్)

అనువాదం: దేవున్ని వద్ద ఉన్నటు వంటి విలువైన జ్ఞానమును ఆశించువారు ముందుగా తమ హృదయాలలో దేవునికి ఎలాంటి స్థానము ఉన్నదో పరిశీలించుకోవాలి. ఎందుకనగా తన దాసుని హృదయములో తనకు ఉన్న విలువకు అనుకూలముగానే దేవుడు తన దాసునికి కూడ విలువను ప్రసాదించును.

(ఖషీరియా, బాబుజ్జికర్ పుట 111).

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం:-

**మానవ సేవా మరియు మానవ జాతి పట్ల చూపు సానుభూతిని గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అమూల్యమైన ఉపదేశములు.**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరల ఇట్లు తెల్పిరి:

" ఈ సులక్షణాలే మన ప్రగతికి సోపానం. నా దృష్టిలో దాసుల హక్కులను చెల్లించు ఈ అంశమే దైవ హక్కులు చెల్లించుటలో దృఢత్వమునిచ్చును. మానవ సమాజంతో సులక్షణంగా నడుచుకునే వ్యక్తి విశ్వాసాన్ని, అల్లాహ్ తాలా ఎన్నడు వృథా చేయడు. మానవుడు దేవుని ప్రసన్నత కోసం ఒక సత్కార్యము చేసినప్పుడు, తన బలహీన సోదరునికి సహాయమును అందించినప్పుడు, అతనిలో గల స్వచ్ఛత వలన అతని విశ్వాసం మిక్కిలి పటిష్టతకు చేరును. కాని కేవలం ప్రదర్శనల కోసం, పొగడ్తల కోసం ఉత్తమముగా వ్యవహరించినచో ఆ వ్యవహారము దైవ ప్రీతిని పొందలేదు. వారిలో స్వచ్ఛత లేనందున ఆ కార్యము వారికి ఎలాంటి ప్రయోజనంను చేకూర్చదు. ఈ విధముగా అనేక మంది సత్రాలను నిర్మించుతారు, కాని వాటి వెనుక గల ఉద్దేశం కేవలం తమను తాము కీర్తింప జేసుకోవడమై యుండును. ఒకవేళ మానవుడు అల్లాహ్ తాలా ప్రీతి కోసం ఎంత చిన్నటి సత్కార్యము చేసినను అల్లాహ్ తాలా ఆ సత్కార్యమును వృథా చేయడు. పైగా అందుకు తగిన ప్రతిఫలమును కూడ అందించును. నేను తజ్కిరతుల్ ఔలియాలో ఒక విషయమును చదివినాను. ఒక అనుభవ శాలి ఆ విషయమును ఇలా వివరించెను: ఒకసారి భారి వర్షం కురిసింది. ఆ భారి వర్షం కారణంగా చాలా రోజుల వరకు వర్షం కురుస్తూనే ఉన్నది. ఆ వర్షపు రోజులలో నేను ఒక 80 సంవత్సరాల వృద్ధుడిని పిచుకలకు మిద్దేపై గింజలు వేస్తుండగా చుసాను. అవిశ్వాసుల సత్కార్యములు వృథా అయిపోవును అనే ఆలోచనలతో నీవు చేస్తున్న ఈ పని వలన నీకు ఏం ప్రయోజనం కల్గుతుంది? అని అతనిని ప్రశ్నించాను. అందుకు ఆ వృద్ధుడు తప్పకుండా ఫలితము లభించును అని సమాధానం ఇచ్చెను. మరల ఆ అనుభవ శాలియే మరల ఈ విషయమును తెలియజేసెను. ఒకసారి నేను హజ్ యాత్రకు వెళ్ళినప్పుడు అతడు ఆ వృద్ధుడిని ఖాన కాబా చుట్టు ప్రదర్శనలు చేయడంను చూసాను. నన్ను గుర్తి పట్టిన ఆ వృద్ధుడు నా పలకరింపు కన్న ముందే నన్ను పలకరిస్తూ, చూడు ఆ గింజల ప్రతిఫలం నేడు నాకు దక్కినదా లేదా? అని నన్ను ప్రశ్నించెను. అనగా ఆ గింజలే నన్ను ఇస్లాంను స్వీకరించునట్లు చేసినవి. " అని అర్థం.

( మల్ఫూజాత్ సంపుటి 4, పుట 216).

మరల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెల్పిరి:

"నేను మీకు చేయు హితబోధ ఏమనగా, చెడు నుండి దూరముండుము. మానవుల పట్ల సానుభూతిని చూపుము. మీ హృదయాలలో గల కపటములను, కుత్రలను శుభ్రం చేసుకొనుము. ఫలితముగా మీరు దేవదూతలుగా పరివర్తనం చెందెదరు. మానవుల పట్ల కనికరం బోధించని ధర్మము ఎంతో నీచమైనది, అపవిత్రమైనది. మనస్పర్ధపు ముళ్ళులతో కూడిన మార్గము ఎంతో ఘోరమైనది. కావున నాతో అనుబంధీకులైన మీరు అలా ఉండకూడదు. ధర్మము వలన ఏం ప్రయోజనం చేకూరుతుందని మీరు ఆలోచించండి ?. ధర్మమనగా కేవలం మీరు ప్రజలను హింసించడమేనా?. అలా కాదు. వాస్తవానికి ధర్మమనగా దైవత్వపు జీవితంను పొందడం. దైవగుణాలను తమలో అలవర్చుకున్న మానవునికి తప్ప మరెవరికి నేడు ఆ జీవితం లభించదు, ఇక ముందు కూడ లభించదు. పరలోకంలో కరుణించబడుటకై ఇహలోకములో దైవప్రీతిని ఆశిస్తూ అందరిపై కనికరంను చూపుము. రమ్ము !, నేను మీకోక మార్గమును చూపెదను. ఫలితముగా అన్ని కాంతుల కన్న మీ తేజస్సు అధికముగా ప్రకాశించును. ఆ మార్గమేమనగా నీవు హేయమైన కపటములను, వైరములను వదిలివేయుము. మానవ జాతి పట్ల ప్రగాఢ సానుభూతిని చూపుము. " ( గవర్నమెంట్ అంగ్రేజి ఔర్ జిహాద్, రూహాని ఖజాయిన్ సంపుటి 17, పుట 14)

మరొక సందర్భమున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెల్పిరి:

" అనేకులలో తమ సోదరుల పట్ల ఎలాంటి సానుభూతి లేకపోవడంను నేను చూస్తున్నాను. ఒక సోదరుడు ఆకలితో అలమటించిన కూడ పట్టించుకునే నాదుడే లేడు. అతని అవసరంను తీర్చుటకు ఏదేని ప్రయత్నం చేయువారు ఒక్కరు లేరు. ఒకవేళ అతడు ఏదేని సమస్యలలో చిక్కుకున్నచో అతనికి ఆర్థిక సహాయమును అందించి అతనికి చేయూత నివ్వాలనే ఆలోచనలు కూడ ఎవరికి కలగడం లేదు. హదీస్ షరీఫ్‌లో పొరుగు వారి హక్కులను నెరవేర్చుతూ, వారి పట్ల సానుభూతి చూపమని బోధించడమైనది. ఒకవేళ మీరు మాంసంను వండినచో చారును అధికముగా పెట్టి అందులో నుండి పొరుగు వారికి కూడ కొంత పంపగలరని ఆదేశించడమైనది. కాని నేడు కేవలం తమ ఆకలినే చూసుకుంటున్నారు. ఇతరులను గూర్చి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పొరుగు వారనగా కేవలం మన ఇంటి ప్రక్కన ఉన్నవారని అర్థం కాదు. వందల మైళ్ళ దూరంలో ఉన్న మీ సోదరులు కూడ మీ పొరుగు వారే అనబడుదురు.

(మల్ఫూజాత్ సంపుటి 4, పుట 215)

మానవ సమాజం పట్ల వారి హృదయంలో గల అమితమైన అభిమానములకు ఉదాహారణ మరెక్కడ లభించదు. వారు (అ) తమ అభిమానాన్ని ఈ విధముగా వ్యక్తపర్చిరి: " ప్రపంచములో నాకు ఎవరితోను శత్రుత్వం లేదు. నేను మానవ జాతిని ఒక తల్లి తన బిడ్డను ప్రేమించినంతగా, అంతకన్న ఎక్కువగా ప్రేమిస్తున్నాను. నేను కేవలం సత్యాన్ని కనుమరుగు చేసే అసత్య సిద్ధాంతాలను వ్యతిరేకిస్తున్నాను. మానవ జాతి పట్ల సానుభూతి చూపడం నా బాధ్యత. అసత్యము, అన్యారాధన, దౌర్జన్యం, దుశ్చర్యలు, అన్యాయం, అమర్యాధతో ప్రవర్తించడం వంటి వాటిని దూరం చేయడం నా కర్తవ్యం. "

(అర్బయీన్ , రూహాని ఖజాయిన్ సంపుటి 17, పుట 344)

మరల వారు ఇలా ఉపదేశించిరి: " ఈ కారణం చేతనే అల్లాహ్ తాలా సూరహ్ ఫాతిహాను నేర్పినాడు. ఇందులో తన ప్రథమ లక్షణమైన **రబ్బుల్ ఆలమీన్** (సకల లోకాల సంరక్షకుడు) అన్నింటికన్న ముందుగా ప్రస్తావించెను. ఈ లక్షణములో సకల ప్రాణ కోటిలన్ని ఇమిడి ఉన్నవి. కావున ఒక విశ్వాసి సానుభూతి కూడ అందుకు తగిన స్థాయిలో విస్తృతముగా ఉండాలి. ఫలితముగా అన్ని రకాల పశు, పక్షాదులు, సర్వ ప్రాణకోటి వారి సానుభూతిని పొందును. ఆ తదుపరి రహ్మాన్ అనే లక్షణమును ప్రస్తావించెను. అనగా సకల ప్రాణకోటి పట్ల ప్రత్యేకమైన సానుభూతిని చూపవలెనని ఈ లక్షణము ద్వారా మనకు ఒక పాఠమును నేర్పడం జరిగింది. ఆ తరువాత ప్రస్తావించిన రహీం అనే లక్షణములో విచక్షణ రహితముగా మానవజాతి పట్ల సానుభూతి చూపాలి అనే పాఠంను నేర్పడం జరిగింది. మొత్తానికి అల్లాహ్ తాలా సూరహ్ ఫాతిహాలో ప్రస్తావించిన లక్షణాలన్నింటిని తన సుగుణాలుగా పేర్కొనుచు వాటిని తన దాసులు కూడ అలవర్చు కోవాలని సూచించాడు. అనగా ఒక వ్యక్తి సౌభాగ్యాలతో, సిరి సంపదలతో తూలలాడుచున్నచో తన తోటి వారికి సాధ్యమైనంత వరకు సహాయంను అందించుటకు ప్రయత్నించాలి. ఎదుటి వారు తమ బంధుమిత్రువులే గాని, మరెవరైన గాని అతని పట్ల విముఖతను చూపకూడదు. వారి పట్ల అపరిచితుల వలే వ్యవహరించకూడదు.

(పేజి నెం 12లో చదువగలరు.)

# జుమా ప్రసంగము

**ప్రపంచాన్ని దైవ ఏకత్వము మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పతాకము నీడ క్రిందికి తీసుకవచ్చుటకు మనం అధికముగా ప్రయత్నించాలి. తహ్రీకె జదీద్ ఉద్దేశము కూడ ఇదియే.**

**అల్లాహ్ తఆలా కృపానుసారము ప్రపంచవ్యాప్త అహ్మదియ్య జమాఅత్ తహ్రీకె జదీద్ ఆర్థిక విభాగములో 14.5 మిలియన్ అనగా ఒక కోటి 45 లక్షల పౌండ్ల త్యాగము సమర్పించుకొను అనుగ్రహము పొందినది. ఈ వసూలు గత సంవత్సరం కంటే 8 లక్షల 82 వేల పౌండ్లు కంటే అధికం.**

**నా దృష్టిని ఆకర్శించుకోవడం కోసం, నా ప్రీతిని పొందడం కోసం, ప్రత్యేకించి నా ప్రీతిని పొందడం కోసం మీరు త్యాగం చేసినచో, నేను మీ భయాందోళనలను దూరం చేయుదును, మీకు మనశ్శాంతిని కల్గించుదును, మిమ్ము శాంత పర్చుదును, మిమ్ము నా ఒడిలో చేర్చుకుంటాను ఇదే నా వాగ్దానం అని అల్లాహ్ తెల్పుచున్నాడు.**

**త్యాగాలు అల్లాహ్ తాలా సన్నిధిలో స్వీకరించబడుతాయి. కాని నిబంధన ఏమిటనగా త్యాగాల ఉద్దేశం కేవలం దైవప్రీతిని పొందుటయే కావలెయును.**

**తహ్రీకే జదీద్ యొక్క 86వ ఆర్థిక సంవత్సరము విజయవంతముగా, శుభప్రదముగా ముగింపు మరియు 87 వ ఆర్థిక సంవత్సరము ప్రారంభపు ప్రకటన.**

**ఈ సంవత్సరము తహ్రీకే జదీద్ ఆధ్వర్యంలో ఆర్థిక త్యాగాలు చేసిన మొదటి 10 దేశాలు : జర్మని, ఇంగ్లాండ్, అమెరికా, కెనడా, మిడిలిస్ట్‌కు చెందిన ఒక దేశం, భారతదేశం, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఘానా, మరల మిడిలిస్ట్‌కు చెందిన మరొక దేశం.**

**ప్రపంచమంతట వివిధ జాతులతో అనుసంధానమై జీవనం కొనసాగిస్తున్న అహ్మదీయ స్త్రీ, పురుషులు, బాలబాలికలు, నూతన అహ్మదీయుల అసాధారణ త్యాగాలు, వాటి ఫలితముగా బహిర్గతమయ్యే దైవానుగ్రాహాల ప్రస్తావనలు.**

**నేటి పరిస్థితులలో అంతర్జాతీయ ఇస్లాం ధర్మం మరియు ముస్లిం సమాజం కొరకు ప్రత్యేక దుఆలు చేయుటకై పిలుపు.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 06 నవంబర్ 2020, (06 నబువ్వతఎ 1399 హి.ష) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

اَلَّذِيْنَ يُنْفِقُوْنَ أَمْوَالَهُمْ بِاللَّيْلِ وَالنَّهَارِ سِرًّا وَّعَلَانِيَةً فَلَهُمْ أَجْرُهُمْ عِنْدَ رَبِّهِمْ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ (البقرة:275)

అనగా: రాత్రివేళలో, పగటి వేళలో, ఇతరులకు తెలియకుండా, ఇతరులకు తెలియునట్లుగా ప్రజలలో తమ ధనమును ఖర్చుచేయువారి ప్రతిఫలం వారి సంరక్షకుడైన అల్లాహ్ వద్ద యున్నది. వారికి ఎలాంటి భయము, బాధకలుగవు. (బఖ్రాహ్: 275).

అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో విశ్వాసులకు ధన త్యాగాల వైపు అనేక చోట్ల శ్రద్ధ కల్పించాడు. ఈ సూక్తిలో కూడ మనం చూసినట్లైతే విశ్వాసులకు ప్రత్యేక శ్రద్ధను కల్పిస్తూ ఇలా ఆదేశించడమైనది. విశ్వాసులు దైవ మార్గంలో రాత్రింభవళ్ళు ఖర్చు చేస్తుంటారు. ఈ ఖర్చును వారు కొన్ని సందర్భాలలో ఇతరులకు తెలియకుండా, మరికొన్ని సందర్భాలలో ఇతరులకు తెలియునట్లుగా ఖర్చు చేస్తూంటారు. అల్లాహ్ తాలా సన్నిధిలో ఈ రెండు విధానాలు ఆమోధయోగ్యమైనవే. అనగా ప్రకటన రూపంలో, గోప్యరూపంలో ఖర్చుచేయు విధానాలు. ఎందుకనగా అల్లాహ్ తాలా మరొకచోట ఈ విధముగా తెలియజేస్తున్నాడు. అట్టి విశ్వాసులు కేవలం దైవ ప్రీతిని మాత్రమే ఆశించి దైవ మార్గంలో ఖర్చు చేస్తూంటారు. ఈ విషయాన్ని ఇలా తెలియజేశాడు: వమా తున్ఫిఖూన ఇల్లిబ్త్భిఘాఅ వజ్హిల్లాహి . ( బఖ్రాహ్: 273) అనగా అల్లాహ్ ప్రీతి కొరకే వారు ఖర్చు చేయుదురు. దైవ ప్రీతిలేకుండా వారు ఎలాంటి ఖర్చు చేయరు. అనగా వారి ఏకైక లక్ష్యం కేవలం దైవ ప్రీతిని పొందడమే. కావున ఒక స్వచ్ఛమైన విశ్వాసుని గుర్తింపు ఏమిటనగా, వారు దైవ మార్గంలో సత్కార్యములు ఆచరించవలెను, తమ స్వాఆర్జితం నుండి దైవ మార్గంలో ఖర్చుచేయవలెను. రాత్రింభవళ్ళు సత్కార్యములు చేయాలనే ఆందోళన ఉండవలెను. కొన్ని సందర్భాలలో గోప్యముగా, మరి కొన్ని సందర్భాలలో ప్రకటన రూపంలో సత్కార్యములు చేయవలెను. కొన్ని సందర్భాలలో ప్రకటనగా ధన త్యాగం చేయవలెను, మరి కొన్ని సందర్భాలలో గోప్యముగా ధన త్యాగం చేయవలెను. ఇలాంటి త్యాగాలే దేవుని సన్నిధిలో ఆమోదం పొందుతాయి. కాని నిబంధన ఏమిటనగా, అట్టి త్యాగాల లక్ష్యం కేవలం దైవ ప్రీతి సాధనయై ఉండాలి. ఒకవేళ ఇతరులకు చూపించడానికి ఖర్చుచేయుచున్నచో అట్టి ఖర్చుతో కూడిన త్యాగాలు అల్లాహ్ సన్నిధిలో ఆమోదం పొందవు. పైగా అలా ప్రదర్శనకారి ఉద్దేశంతో త్యాగాలు

చేయువారి ముఖముపైనే వారి త్యాగాలు వేయబడుతాయి. కావున ఈ స్ఫూర్తిని అర్థం చేసుకుంటూ ప్రతి ఒక్క విశ్వాసి త్యాగాలను చేయవలెను. కావున ఈ స్ఫూర్తినే తమ లక్ష్యముగా భావించుకుంటూ ప్రతి జమాఅత్ సభ్యుడు దైవానుగ్రహంతో ధన త్యాగాలు చేస్తుంటాడు. ఒకవేళ ఈ స్ఫూర్తి మనలో లేనిచో మన త్యాగాలు కూడ వృధాయే అవుతాయి, అప్రయోజనమై పోతాయి. ఒకవేళ ఈ త్యాగాలు ఫలాన వ్యక్తి ఇంత మొత్తంలో త్యాగం చేశాడు, కావున నేను అతని కంటే ఎక్కువ త్యాగం చేసి చూపాలనే ఆలోచనతో త్యాగాలు చేసినచో లేదా ఫలాన వీధి వారు, లేదా ఫలాన జమాఅత్ వారు మన కంటే ఎక్కువ త్యాగాలు చేసినచో పరులు మనలను ఏమనుకుంటారు అనే ఆలోచనతో త్యాగాలు చేసినచో అవి ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చవు. ఇతరుల కంటే ముందుండాలనే ఆలోచన మంచిదే. అంతేగాని వెనుకబడినచో ప్రజలు ఏమి అనుకుంటారో అనే ఆలోచనయే సరైనది కాదు. దేవుని దృష్టిలో ఎక్కువ స్థాయిలో త్యాగాలు చేయువారిగా గుర్తించబడాలి అనే ఆలోచన మాత్రమే ఉండవలెను. అప్పుడే అది త్యాగాలలో ముందుకు వెళ్ళడం అనబడుతుంది. అంతేగాని నేను ఇంత మొత్తంలో చందా చెల్లిస్తున్నానని ప్రజలలో చెప్పుకోవడానికి చందా చెల్లించినచో లేదా ఏదేని సమయం వచ్చినప్పుడు జమాఅత్ పరంగా ఒత్తిడి పెంచడం కొరకు గాని, నేను ఇంత చందా చెల్లిస్తున్నాను మరి నా మాట ఎందుకు వినడం లేదని ప్రశ్నించడానికి గాని, ఫలాన విషయంలో నాకు హక్కు ఉందని వాదించడానికి లేదా ఏదేని జమాఅత్ సౌకర్యము పొందడానికి గాని లేదా ఇంత మొత్తంలో చందా చెల్లించి ఖలీఫా గారి దృష్టిని ఆకర్షించాలని లేదా పదవి దారుల దృష్టిలో గుర్తింపు సాధించాలనే ఉద్దేశంతో గాని లేదా వారి మెప్పు పొందాలనే ఉద్దేశంతో గాని ధన త్యాగం చేసినచో అట్టి త్యాగాలు అప్రయోజనమే అవుతాయి. ఎలాంటి లాభమును చేకూర్చవు. ఇవన్నియు ధనత్యాగస్ఫూర్తికి వ్యతిరేకమైనవి. పైగా ఇలాంటి ఆలోచనల వలన నష్టమే జరుగుతుంది. అందుకే అల్లాహ్ తాలా ఈ విధముగా తెలియ జేయుచున్నాడు. ఇలాంటి ఆలోచనలతో నా మార్గంలో ఖర్చు చేసినచో అవి ఎలాంటి లాభమును చేకూర్చలేవు. నా మార్గంలో ఖర్చు చేయాలనుకుంటే అది కేవలం నా ప్రీతిని పొందాలనే ఉద్దేశంతోనే ఖర్చు చేయాలి. నిజానికి కూడ దైవ ప్రీతిని ఆశించి ఖర్చు చేయువారికి అల్లాహ్ తాలాయే గౌరవాన్ని కల్పించుతాడు. కాని అట్టి గౌరవం వారిని వినయం, విధేయతలో ఇంకా ఎదుగునట్లు చేయవలెను. అంతేగాకా వారిని ఇతరులు పొగిడినచో వారికి సిగ్గువేయును. ఒకవేళ వర్తమాన ఖలీఫా దృష్టికి రావాలని కోరుకున్నచో ఆ కోరిక కూడ కేవలం ఖలీఫా గారు తమ కోసం దుఆ చేయాలని, ఖలీఫాతో ఒక పటిష్ట అనుబంధమును ఏర్పర్చుకోవాలనే ఆకాంక్ష మేరకే ఉండాలి. ఒకరి బైఅత్‌చేసినప్పుడు వారి దుఆలను కూడ పొందాలని మానవుడు కోరుకోవడం సహజం. ఖిలాఫత్ పట్ల గట్టి విశ్వాసం ఉన్నచో ఇలాంటి కోరిక కోరుకోవడంలో ఎలాంటి తప్పులేదు. అంతేగాని ప్రదర్శన కారితనం ఉండకూడదు. దైవ ప్రీతిని పొందాలనే ఆకాంక్ష ఒక్కటే ఉండాలి. దైవ ప్రీతి పొందాలనే ఆకాంక్ష మాత్రమే ఉండాలి. అట్టి త్యాగస్ఫూర్తి వలన వర్తమాన ఖలీఫా దుఆలకు అర్హుడను కావాలని, ఇంకా అల్లాహ్ తాలా సాన్నిహిత్యంను పొందాలని, అల్లాహ్ తాలా ప్రీతిని పొందాలని మాత్రమే కోరుకోవాలి. విశ్వాసులు పరస్పరం ఒకరి కొరకు మరొకరు చేసుకునే దుఆల వలనే పరస్పర ఆధ్యాత్మిక స్థాయిలు అభివృద్ధి చెందుతాయి. ఇలాంటి అలోచనలు కూడ అల్లాహ్ తాలా బోధనలకు అనుగుణముగానే ఉంటాయి.

అల్లాహ్ తాలా మరల ఇలా తెల్పుచున్నాడు: నా దృష్టిని ఆకర్షించుకోవడం కోసం, నా ప్రీతిని పొందడం కోసం, ప్రత్యేకించి నా ప్రీతిని పొందడం కోసం మీరు త్యాగం చేసినచో, నేను మీ భయాందోళనలను దూరం చేయుదును, మీకు మనశ్శాంతిని కల్గించుదును, మిమ్ము శాంత పర్చుదును, మిమ్ము నా ఒడిలో చేర్చుకుంటాను ఇదే నా వాగ్దానం. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ఈ వర్గము ఇట్టి ఆలోచనలనే కల్గియున్నది. అనగా నేటి కాలపు ఇమాం మరియు మసీహ్ మౌవూద్, మహ్దీ మౌవూద్ మరియు అం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన శిష్యుడిని విశ్వసించిన వర్గము. దేవుని ధర్మము కొరకే ఆర్థిక త్యాగాలు చేస్తుంటారు. అలాంటి వారి ఆర్థిక త్యాగాలకు అల్లాహ్ తాలా ఫలములు అందించకుండా వాటిని వృధా చేయడు. అల్లాహ్ తాలా మార్గంలో అతని ప్రీతిని పొందుటకు మాత్రమే ఖర్చు చేయుచున్నాము. అలాంటప్పుడు అల్లాహ్ తాలా వాటి ప్రతిఫలమును ధన రూపంలో గాని, మరేదైన బహుమాన రూపంలో గాని కొన్ని సందర్భాలలో వెను వెంటనే అందించును. అందుకు తగిన ఉదాహరణలను మనం ప్రతి రోజు చూస్తూనే ఉన్నాము. పదులు, ఇరవైలు, వందల సంఖ్యలో గాకుండా ఏకంగా వేల సంఖ్యలో ఇందుకు ఉదాహరణలు మన ముందు గలవు. ఇంకా చెప్పదలచినచో దేవుని ప్రీతిని పొందుతూ జీవితం కొనసాగించు వారి ఉదాహరణలు లక్షలలో గలవు. వారు తమ జీవితంలో అట్టి అద్భుతాలను చూస్తుంటారు. ఫలితముగా వారి విశ్వాసం కూడ మిక్కిలి పటిష్ట మవుతుంది. ధన త్యాగం చేయువారు నిశ్చయముగా గుర్తుంచుకోవలసిన మరొక విషయమేమనగా, వారు తమ భార్య పిల్లల హక్కులను కూడ నెరవేర్చవలెయును. వారి హక్కులను చెల్లించుట కూడ ఒక విశ్వాసి లక్షణము. తమ భార్య పిల్లల హక్కులను చెల్లించకపోవడం, వారిని పట్టించుకోకపోవడం పాపం అనబడుతుంది. కాని ఇక్కడ గుర్తుంచుకోవలసిన మరొక విషయమేమనగా పొదుపును అలవర్చు కుంటూ పొదుపు యొక్క ప్రయోజనంను కుటుంబ సభ్యులకు తెలియజేసుకుంటూ వారిని కూడ దైవ మార్గంలో ధనం ఖర్చుచేయుటకు ప్రోత్సహించాలి. వారి చేత కూడ ఖర్చు చేయించాలి. అలా ఖర్చు చేయించిన వారి పిల్లలను అల్లాహ్ తాలా తన అనుగ్రహంతో ఊహించని మార్గల ద్వారా తన అనుగ్రహానికి వారసులను చేసుకుంటాడు. వాటిని చూసి మానవుడు ఆశ్చర్యపోతాడు. ఇప్పుడు నేను కొందరు ధన త్యాగాలు చేసిన వారిని గూర్చి, వారు చేసిన త్యాగాల వలన అల్లాహ్ తలా వారిపై కురిపించిన అనుగ్రహాలను గూర్చి, ధనమును ఖర్చు చేయుటకు అల్లాహ్ తాలా వారిలో కల్పించిన ప్రోత్సాహాన్ని గూర్చి, అలాంటి వారికి అల్లాహ్ తాలా ఎలా తిరిగి అనుగ్రహించాడు అనే కొన్ని సంఘటనలను మీ ముందు ప్రస్తావించెదను. ఇలాంటి సంఘటనలను ప్రస్తావించడం ద్వారా కలిగే లాభమేమనగా, వీటి ద్వారా ఇతరులలో కూడ ధన త్యాగపు ప్రోత్సాహం కల్గుతుంది. ఇలాంటి సంఘటనలు మాపై చాలా ప్రభావాన్ని చూపాయి అని, ఆ విధముగా అల్లాహ్ తాలా కూడ మాపై తన అనుగ్రహాన్ని కురిపించాడని అనేకులు నాకు లేఖలు వ్రాస్తుంటారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒకచోట ఇలా అన్నారు: " నీవు అన్ని పనులను గోప్యముగా చేయుము అని ఖుర్ఆన్ బోధించడం లేదు, నీవు నీ సామర్థ్యం మేరకు కొన్ని కారణాల వలన కొన్ని సత్కార్యములను గోప్యముగా ఆచరించినచో మీకు ప్రయోజనము చేకూరునని భావించినచో వాటిని గోప్యముగానే ఆచరించుము. మరి కొన్ని సత్కార్యములను బహిరంగముగా ఆచరించినచో వాటి వలన ఇతరులకు ప్రయోజనం చేకూరును అని భావించినచో బహిరంగముగానే ఆచరించుము. ఫలితముగా మీకు రెండు ప్రతిఫలములు లభించును. బలహీన ప్రజలు కూడ మిమ్ములను అనుసరిస్తూ సత్కార్యములు చేయుదురు. మరల ఇలా అన్నారు: కేవలం మాట సహాయముగానే కాకుండా ఆచరణాత్మకముగా ఇతరులను ప్రోత్సహించండి, ఎందుకనగా అన్నిచోట్ల మాటలు ప్రభావాన్ని చూపలేవు. కాని అన్ని చోట్ల మీ నడవడిక తప్పక ప్రభావాన్ని చూపుతుంది. " (కిస్తియే నూహ్, రుహాని ఖజాయిన్ సంపుటి 19, పుట 31-32).

కావున నేడు నేను ప్రస్తావించనున్న సంఘటనలను గూర్చి తెలియజేయునదేమనగా, వాటిని ప్రస్తావించమని ప్రజలు లేఖల ద్వారా కోరుకోరు. నేను వాటిని స్వయముగా ప్రస్తావించుతాను. తద్వారా ఇతరులకు అవి ఆదర్శముగా నిలిచి, వారిపై కూడ ప్రభావం చూపుతుంటాయి. కొందరు తమ పేర్లను ప్రస్తావించకూడదని లేఖలు వ్రాస్తుంటారు. మొత్తానికి ఇప్పుడు నేను కొన్ని సంఘటనలు ప్రస్తావించెదను.

ఈ సంఘటనలు జరిగిన వారికి కూడ అల్లాహ్ తాలా రెట్టింపు పుణ్య ఫలములను అందించుగాకా!, వారు దైవ మార్గంలో ఖర్చు చేయడం ఒక పుణ్యం. వారి ఆదర్శాలు, సంఘటనలు ఇతరులకు ధన త్యాగం చేయుట వైపుకు ప్రోత్సహించును లేదా ప్రోత్సహించబడును. ఆర్థిక త్యాగాల అవగాహనను పెంచును.

బైఅత్ చేసిన తరువాత దైవ మార్గంలో ధనమును ఖర్చు చేయాలనే ఉత్సాహం ఏ విధముగా ఉంటుందో తెలియజేయు సంఘటన ఇది. 2020నాటి జల్సా సాలాన యొక్క ముగింపు కార్యక్రమములో అల్లాహ్ తాలా కురిపించిన అనుగ్రహములను గూర్చి నేను ప్రసంగించాను. ఆ విషయమును గూర్చి తెల్పుచూ అల్బానియా ముబల్లిఘ్ సమద్ గారు ఈ విధముగా వ్రాసారు: ఒక అల్బానియా మిత్రుడు జాఫర్ కోచిగారు ఆ ప్రసంగాన్ని విన్నారు. ఆ ప్రసంగంలో నేను వారు అహ్మదియ్యత్‌ను స్వీకరించిన విషయాన్ని కూడ ప్రస్తావించాను. ఆ విషయాన్ని తెలియజేస్తూ అక్కడి ముబల్లిఘ్ గారు ఈ విధముగా వ్రాసారు: ఆగష్టు మాసం వరకు జాఫర్ కోచి గారికి ఎలాంటి ఆధాయం లేకుండెను. ఒక జుమా రోజు వారు నా వద్దకు వచ్చి అహ్మదీయులు చెల్లిస్తున్న చందాలను గూర్చి వివరముగా తెలుపమని కోరారు. కావున వారికి మరొకసారి అన్ని రకాల చందాలను గూర్చి వివరముగా తెలిపాను. బైఅత్ సమయంలో కూడ వారికి తెలియజేయడం జరిగింది. మరల వారు ఇలా తెలిపారు: ఆ మాసంలోనే వారి ఫ్లాట్ అద్దెకు ఇవ్వడం జరిగింది. ఫలితముగా వారికి అద్దె రాసాగింది. కావున వారు మొదటి మాసపు అద్దెలోనే షరహ్‌కంటె ఎక్కువ రెట్లు చందాను తీసుకొని వచ్చారు. ఆపై ఇలా అన్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నిర్దేశించిన ప్రామానికం ప్రకారం చెల్లించిన చందా పోగా మిగిలిన చందాను తహ్‌రీకే జదీద్ మరియు వఖ్ఫే జదీద్ చందాలుగా స్వీకరించమని కోరారు. అందుకు ముబల్లిఘ్ గారు వారికి దైవ మార్గంలో ఖర్చు చేయువారికి అల్లాహ్ తాలా రెట్టింపు స్థాయిలో తిరిగి ఇచ్చును అని అల్లాహ్ తాలా ఖుర్ఆన్‌లో వాగ్దానం చేశాడు అని చెప్పగా, అప్పుడు జాఫర్ కోచి గారు నేను రెంటిపు సంకల్పంతో చందా ఇవ్వలేదు. కేవలం అల్లాహ్ తాలా ప్రీతి కొరకే చందాను చెల్లిస్తున్నాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు ధర్మము కొరకు ధన త్యాగము చేయండి అని ఆదేశించారు. ధర్మం కొరకు ధన త్యాగం చేయాలని ఇస్లాం ఆదేశిస్తుంది కావున చందా చెల్లిస్తున్నాను అని సమాధానం ఇచ్చారు. అంతేగాకా వారు ప్రతి నెల క్రమం తప్పకుండా చందా చెల్లిస్తున్నారు. ప్రాపంచిక వ్యవహారములో మునిగి ఉన్నవారి ఆలోచనలు కూడ ఒక్కసారిగా మారి పోతుంటాయి.

మరల అర్జెంటీనాకు చెందిన ముబల్లిఘ్ సర్వర్ గారు ఈ విధముగా వ్రాసారు: అర్జెంటీనాలో కరోనా వైరస్ మరియు సాధారణ ఇతర వ్యాధుల వలన అక్కడి ప్రజలు తీవ్ర అహార సమస్యలును ఎదుర్కొంటున్నారు. అయినా కూడ అక్కడి నూతన అహ్మదీయులకు ఇస్లాం ప్రాథమిక సూత్రాలలో దైవ మార్గంలో ఖర్చు చేయడం కూడ ఒక సూత్రమే అని తెలియపర్చాము. అంతేగాకా అహ్మదియ్య జమాఅత్‌లో దైవాదేశం మేరకు అనుసరించడం కొరకు తహ్‌రీకే జదీద్ అనే ఒక శాఖపరమైన స్కీం గలదు అని నచ్చజెప్పగా, అక్కడి ప్రాంతీయ నూతన అహ్మదీయులు వారి సామర్థ్యం మేరకు చందాలు చెల్లించారు. వారిలో ఫాతిమా వెరోనికా గారు కూడ గలరు. వారికి కూడ అసాధారణమైన త్యాగం చేయు అవకాశం లభించింది. వీరు ఒక వితంతువు. వృత్తి పరంగా వారిది చాలా తక్కువ జీతం. తహ్‌రీకే జదీద్ ఆర్థిక సంవత్సరం పూర్తి కావడం కొరకు కేవలం కొన్నిరోజులే మిగిలి యున్నాయని అక్కడి నూతన అహ్మదీయులందరికి తెలియజేయగా, ఫాతిమా గారు ముబల్లిఘ్ గారికి ప్రస్తుతం నా వద్ద డబ్బు లేదు, కాని త్వరలోనే కొంత మొత్తాన్ని చెల్లించెదనని సందేశం పంపారు. ఆ ప్రకారం గానే వారు కొన్ని రోజుల తరువాత 5000ల అర్జెంటీనా రూపాయలను చందాగా చెల్లించారు. అర్జెంటీనాలో ఏర్పడిన అహార తీవ్రతల దృష్ట్యా ఈ ధనము చాలా అధికమని చెప్పుకోవచ్చును. మరల ముబల్లిఘ్ గారు ఈ విధముగా వ్రాసారు: వారి ఉత్సాహాన్ని చూసి, నేను వారికి కృతజ్ఞతలు తెలిపాను. అందుకు వారు ఇందులో నాకు కృతజ్ఞతలు ఎందుకు తెల్పుచున్నారు. నేను మనస్ఫూర్తిగా ఇస్లాంను స్వీకరించాను. ఇస్లాంను అర్థం చేసుకొని స్వీకరించాను. ఇస్లాం ఆదేశాలలో ఒక ఆదేశం దైవ మార్గంలో ఖర్చు చేయడం. నిజానికి నేను క్షమాపణలు కోరుచున్నాను. ఎందుకనగా నేను నా పనిలో పడిపోయి ఒక అహ్మదీయ ముస్లిం చెల్లించు విధముగా సమయానికి చందా చెల్లించలేక పోయాను అని తెలిపారు. పూర్తి విధేయతతో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్‌లో చేరునట్టి వారిలో అల్లాహ్ తాలా ప్రీతిని ఏ విధముగా పొందాలి, ఇందుకోసం ఎలాంటి ప్రయత్నం చేయాలి?, ఏ విధముగా హజ్రత్‌మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్‌ను ముందుకు తీసుకవెళ్ళాలి ? అని అల్లాహ్ తాలా కల్పించినట్టి మార్పు ఇది.

ఇండోనేషియా, ప్రపంచములోని రెండవ కొన అయిన ద్వీపములు. అక్కడి అమీర్ గారు ఈ విధముగా వ్రాసారు: టింగ్‌రేంగ్ అనే ఒక నగరంలో మర్సిలా అనే ఒక మహిళ గలదు. వారు ఇలా తెలిపారు: కరోనా వలన వారి భర్త ఉద్యోగం పోయింది. అందువలన వారు ఒక వ్యాపారాన్ని ప్రారంభించారు, కాని అందులో ఎలాంటి లాభం రాలేదు. అందుకని ఆన్‌లైన్ మోటర్ సైకిల్ సర్వీస్‌లో చేరినారు. అందులో కూడ ఇలాంటి సమస్యలే ఎదురుకాసాగాయి. పరిస్థితులు ఎంత క్లిష్టముగా మారిపో యాయనగా, మరుసటి రోజు తినడానికి ఏమైన దొరుకుతుందా? లేదా? అనే సందిగ్ధత ఏర్పడేది. రమజాన్ మాసంలోనే తహ్‌రీకే జదీద్ చందాను పూర్తిగా చెల్లించాలని భావించాము. ఈ విషయంలో నా భర్త చందా చెల్లించు మార్గం లభించుటకు నన్ను దుఆలు చేయమని పదే పదే కోరేవారు. మరల వారు ఇలా తెలిపారు: రమజాన్ మాసంలో నేను ఒక కలను చూశాను. ఒకవ్యక్తి నా ముందుకు వచ్చి నీవు ఏదైన వాగ్దానం చేశావా? అని అడుగగా, అవును అని సమాధానం ఇచ్చాను. అందుకు మరి ఆ వాగ్దానాన్ని పూర్తి చేయుము అని అన్నారు. నేను కళ్ళు తెరిచి చూడగా, తహజ్జుద్ సమయం అవుతుంది. తహజ్జుద్ తరువాత నేను సహ్‌రి చేయుచు నా భర్తకు నేను చూసిన కలను గూర్చి చెప్పాను. ఆ తరువాత కొన్ని రోజుల తరువాత నా భర్త ఎంతో సంతోషముగా కొంత డబ్బు తీసుకవచ్చి త్వరత్వరగా తహ్‌రీకే జదీద్ చందాను చెల్లించమని నాకు అందించాడు. మరల వారు ఇలా తెలిపారు: నా భర్త ఆన్‌లైన్ మోటర్ సైకిల్ సర్వీస్‌కు చెందిన నగదు మొత్తంను అనగా 50వేల ఇండోనేషియన్ రూపాయలను తీసుకరావడానికి బ్యాంకుకు వెళ్ళి చూడగా అందులో 20 రెట్లు అధికముగా నగదు ఉన్నట్లు తెలిసింది. అంత నగదు ఎలా వచ్చింది అనే విషయం మాకు తెలియదు. కాని ఇది కేవలం అల్లాహ్ తాలా యొక్క సహాయ సహకార దృశ్యమే అని నాకు నమ్మకం గలదు. అతడు కేవలం మా సంకల్పంను చూసి మాకు అనుగ్రహించాడు. ఈ విధముగా అల్లాహ్ తాలా భయాందోళనల నుండి కాపాడుతాడు.

మరల ఇండోనేషియా అమీర్ గారు ఈ విధముగా వ్రాసారు: లాంపంగ్ గ్రామానికి చెందిన ఒక అహ్మదీ మహిళ నూర్ సాహేబా గారు ప్రతి రోజు తన భర్తతో కలసి ఎలిమెంట్రి స్కూల్ ముందు దుకాణంలో నడిపేవారు. అందులో ఎక్కువ లాభాలు రాకున్నను, తమ ఇంటి ఖర్చులు మరియు చందాకు సరిపడ నగదు వచ్చేది. వీరు ప్రతి నెల ఎంతో శ్రద్ధతో చందా చెల్లించేవారు. వారు ఇలా తెలిపారు: కరోనా వైరస్ వలన రెండు నెలల వరకు స్కూల్స్ మూసివేశారు. ఫలితముగా రాబడి లేకుండెను. ఏ విధముగా చందా చెల్లించాలి? అనే ఆందోళన పెరుగ సాగింది. అంతలోనే తన వద్ద తన కుమారుని వద్ద మనీ బాక్స్‌లు ఉన్నాయని గుర్తుకు వచ్చింది. అందులో వారు నగదును దాచేవారు. గల్లా పెట్టే కావచ్చు. దానిని పగలగొట్టి వఖ్ఫే జదీద్ మరియు తహ్‌రీకే జదీద్‌లకు చందా చెల్లించేవారు. అందులో వారు నగదును ప్రోగు చేయసాగారు. వారి పిల్లలకు కూడ ఆర్థిక త్యాగాల ప్రాధాన్యతను గూర్చి వివరంగా చెప్పారు. అలా పిల్లలు దాచుకున్న ఆ నగదును వారు చందాలుగా చెల్లించెవారు. రమజాన్ మాసం ప్రారంభం

కావడానికి ముందు వరకు ఇంట్లో కేవలం ఒక డబ్బా బియ్యం మాత్రమే ఉన్నాయి. ఇద్దరు పిల్లలకు కూడ సరిగా సరిపోవు. మరల వారిట్లు తెలిపారు: నేను పిల్లల కోసం ఉదయం అన్నం వండాను. పిల్లలు అన్నంను నీటితో కలుపుకొని తిన్నారు. ఆపై మీరు మాతో కలసి ఎందుకు అన్నం తినడం లేదని పిల్లలు ప్రశ్నించేవారు. బియ్యం తక్కువగా ఉన్నాయి. అందుకని తల్లిదండ్రుల వద్ద చిరునవ్వు నవ్వి పిల్లలను మభ్యపెట్టడం తప్ప ఎలాంటి సమాధానం లేదు. మధ్యాహ్నం వేళలో మళ్ళి పిల్లలకు ఆకలి వేసింది. కాని ఇప్పుడు కేవలం ఒక పిల్లవాడికి సరిపడ అన్నమే ఉన్నది. ఇద్దరు పిల్లలకు ఆకలి అవుతుంది. రెండవ పిల్లవాడు ఏడ్వసాగాడు. ఆ సమయంలో మేము దుఆ తప్ప మరేమి చేయలేని పరిస్థితి. కావున నమాజ్ చదువి, చాలా దుఆ చేశాము. కొంత సమయం తరువాతనే అల్లాహ్ తాలా సహాయ సహకారములు అందాయి. అనగా అంతలోనే ఒక వ్యక్తి వచ్చాడు. అతని మొక్క జొన్న చేనులో పని చేయుటకు ఇద్దరు కూలీలు కావలెను అని అన్నాడు. అలా నా భర్తకు పని దొరికింది. మా అవసరాలు తీరిపోయాయి.

మాలికి చెందిన హాఫిజ్ అతాఉల్ హలీం గారు మురబ్బి సిల్‌సిలా ఇలా వ్రాసారు: 70 సంవత్సరాల ఒక అహ్మదీయ తాపి మేస్త్రీ యాతార్ అత్రావోడే గారు, ప్రతి నెల క్రమం తప్పకుండా చందా చెల్లించేవారు. వసియ్యత్ వ్యవస్థలో కూడ చేరినారు. వీరు చందా చెల్లించుటకు ఏడు కిలోమీటర్ల మట్టి రోడ్డుపై సైకిల్ త్రొక్కుకుంటూ వచ్చేవారు. కొన్ని రోజులు క్రితం వారి భూమిని ప్రక్కన ఉన్నటు వంటి మరో గ్రామానికి చెందిన ప్రముఖ వ్యక్తి కబ్జా జేసాడు. అందువలన వారు చాలా ఆందోళనకు గురైనారు. వారు దుఆ కొరకు నాకు కూడ లేఖ వ్రాసారు, పైగా క్రమం తప్పకుండా చందాను ఎక్కువగా చెల్లించేవారు. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన గతంలో వారికి వ్యతిరేకముగా తీర్పునిచ్చిన న్యాయమూర్తిమే తిరిగి వారి పక్షంలో తీర్పునిచ్చాడు. అలా వారి భూమి తిరిగి వారికి లభించినది. తిరిగి వస్తుందనే నమ్మకం లేకుండెను. ఎందుకనగా ఆ ప్రముఖ వ్యక్తి చాలా పలుకుబడి గలవాడు. కావున అట్టి వ్యక్తికి వ్యతిరేకముగా న్యాయమూర్తి తీర్పు ఇస్తాడని ఎవరు కూడ ఊహించలేదు. అందుకు వారు కేవలం వారి గ్రామంలోనే గాకుండా ఆ ప్రాంతంలో ఉన్నటు వంటి మస్జిద్‌కు వచ్చి జుమా నమాజ్ తరువాత ప్రజలకు అల్లాహ్ తాలా అందించిన సహాయ సహకారమును గూర్చి తెలుపేవారు. అట్టి ఘటనతో ఇతరులు కూడ ప్రభావితులైనారు. అలా అల్లాహ్ తాలా వారి భయాన్ని పారద్రోలి, మనశ్శాంతిని కల్గించాడు.

ఫ్రాన్స్‌కు చెందిన అమీర్ గారు ఈవిధముగా వ్రాసారు: గత సంవత్సరము కంటే ఈ సంవత్సరము తన తహ్‌రీకే జదీద్ చందాను రెట్టింపు చేస్తూ ఒక వెయ్యి యూరోలను చందాగా వ్రాయించినట్లుగా ఒక మిత్రులు తెలిపారు. కాని లాక్‌డౌన్ కారణంగా ఆధాయం తగ్గిపోయింది. చేసిన వాగ్దానం నెరవేర్చుటకు బహిరంగముగా సాధ్యము కనిపించడం లేదు. వారు కొంత అప్పు కూడ చేశారు. దానిని కూడ చెల్లించాలి. మరోవైపు వెయ్యి యూరోలను చెల్లించాలి. చాలా కష్టముగా ఉన్నది. దుఆ తప్ప మరే మార్గము కనపించడం లేదు. కాని మనస్సులో మాత్రం మనం తిన్న తినకున్నను ముందుగా చందా చెల్లించాలి అనే ఆలోచనలు కల్గుచుండేవి. మరల వారు ఇలా తెలిపారు. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ఆ వారంలోనే నా యజమాని నుండి లాక్‌డౌన్‌లో నేను చేసిన పనికి నేను చందా వ్రాయించిన మొత్తంనకు సమానంగా అనగా వెయ్యి యూరోల నగదు బోనస్‌గా వచ్చింది. మరల వారు ఇలా తెలిపారు: ఇది కేవలం అల్లాహ్ తాలా వైపు నుండి మాకు లభించిన బహుమానం. అంతేగాని ఇలాంటి కష్ట సమయాలలో మా యజమాని నాకు ఇంత పెద్ద నగదును బోనస్‌గా ఇస్తాడని మేము ఎవరం కూడ ఊహించలేదు.

లాక్‌డౌన్ ప్రస్తావన వచ్చింది కావున నేటి నుండి ఇక్కడ మరో నాలుగు వారాల పాటు లాక్‌డౌన్‌ను మరోసారి విధించారు. అందుకే ఈ రోజు మస్జిద్‌లో నా ముందు జుమా నమాజ్ కొరకు ఎవరు లేరు. ఎందుకనగా మోఅజ్జన్ కాకుండా మరెవరు ఉండకూడదనే నిబంధనతో జుమా ప్రసంగానికి ఇక్కడి అధికారులు అనుమతి నిచ్చారు.

కెనడా నుండి ఒక సిరియన్ అహ్మదీ ఈ విధముగా వ్రాసారు: ఎక్కడైన తన పేరును ప్రస్తావించవలసి వచ్చినచో తన పేరును ప్రస్తావించ కూడదని కూడ విన్నవించుకున్నారు. వారు ఇలా తెలిపారు: ఇస్లామాబాద్‌లో నూతన కేంద్రం నిర్మించినందుకు శుభాకాంక్షాలు తెల్పుచూ సంతోషంతో తహ్‌రీకే జదీద్‌లో ఐదువేల కెనడియన్ డాలర్లు చందాగా చెల్లిస్తానని వాగ్దానం చేశాను. గత సంవత్సరం వాగ్దానం చేశారు. అప్పుడు నా నెలవారి జీతం నాలుగువేల డాలర్లు. పరిస్థితులు కూడ బాగానే ఉన్నాయి. కొన్ని నెలల తరువాతనే ఒక క్రొత్త వాహనంను కొనుగోలు చేశాను. ఉద్యోగం కూడ మార్చాను. ఆధాయం కూడ పెరిగింది. ఇంత చక్కటి పరిస్థితులు ఉన్నప్పటికి కూడ కొంత ఇబ్బందిగానే ఉండేది. నేను చేసిన 5వేల వాగ్దానాన్ని ఎలా తీర్చాలి అని ఆలోచించేవాడిని. ఎందుకనగా నా జీతంలోని కొంత డబ్బును నేను సిరియాలో ఉంటున్న నా కుటుంబానికి పంపేవాడిని. ఆపై నేను నా చందా వాగ్దానాన్ని పూర్తి చేయు అవకాశమును కల్పించుము అని అల్లాహ్ తాలాతో దుఆ చేసేవాడిని. మరల ఇలా అన్నారు: జనవరి 2020లో ప్రమాదం జరిగింది. ఒక నెల పాటు ఉద్యోగం చేయలేక పోయాను. ఖర్చుల కోసం అప్పు చేయవలసి వచ్చింది. కరోనా వలన ఆర్థిక పరిస్థితులు చాలా ఇబ్బంధికరముగా మారాయి. లాక్‌డౌన్ ప్రకటించారు. ఫిబ్రవరి, మార్చి మాసాలలో భార్య భర్తలం చాలా తక్కువ ఖరైదన అహారాన్ని తీసుకునే వారము. అలాంటి తప్పని పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఆర్థిక సంవత్సరము పూర్తి గాకముందే చందా పూర్తిగా చెల్లించాలని చాలా ప్రయత్నం చేసేవాడిని, దుఆలు కూడ చేశాము. రమజాన్ మాసం ముగిసేవరకు కాకుండా రమజాన్ మాసంలోనే పూర్తిగా చెల్లించాలని ఆశించాను. కాని అది మా కొరకు ఒక కలగా అనిపించసాగింది. మరల ఇలా తెలిపారు: టాక్సీ నడపడం వదిలి వేసి, భోజనం డెలివరి పనిలో చేరిపోయాను. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన పరిస్థితులు చక్కబడ సాగాయి. కావున మరల మేము మా సంకల్పాన్ని పటిష్టం చేసుకొని వర్తమాన ఖలీఫా దుఆలను పొందడం కోసం రమజాన్ మాసంలోనే చందా చెల్లించాలని భావించాము. మరల ఇలా తెలిపారు. మేము మా పని సమయాన్ని పెంచుకొని 11 గంటల నుండి 12 గంటల వరకు కష్టపడడం ప్రారంభించాము. ఆ తరువాత మాకు ఎక్కడి నుండి డబ్బు వస్తుందో అర్థం కాలేదు. నా నెలసరి ఆధాయం 9 వేల డాలర్లకు చేరుకుంది. అలా అల్లాహ్ తాలా అనుగ్రహం వలన రమజాన్ మాసం ప్రారంభానికి 10 రోజుల ముందే మేము చందా చెల్లించాము. మరల వారు ఇలా వ్రాసారు: ఫలితముగా ఒకవేళ ఇంతకు మూడు రెట్లు ఎక్కువగా నేను వాగ్ధానం చేసిన కూడ దానిని సంవత్సరము పూర్తి కాకుండానే చెల్లించే నమ్మకం నాకు కల్గింది. మొత్తానికి వారు సిరియాలో ఉంటున్న తమ పేద బంధువులకు కూడ ఆర్థిక సహాయంను అందిస్తున్నారు.

సేరలేవన్ నుండి అమీర్ గారు ఈ విధముగా వ్రాసారు: ఫ్రీ టౌన్ అనే జమాఅత్‌లో ఉస్మాన్ గారు అనబడే ఒక ఇమాం ఉండేవారు. వారు ఇలా వ్రాసారు: సాధారణముగా మేము ప్రతి సంవత్సరం తహ్‌రీకే జదీద్ చందాను చెల్లిస్తుంటాము. కాని ఈ సంవత్సరము మాత్రం మేము చెల్లించు చందా చాలా తక్కువగా చెల్లిస్తున్నామనే ఆలోచన మాలో కల్గింది. మరల వారు ఇలా అన్నారు: నాకు ఎలాంటి ఉద్యోగం లేదు. మాకు ఒక చిన్న పాటి దుకాణం గలదు. దానినే నేను నాభార్య ఇరువురం కలిసి నడుపుచున్నాము. ఆ దుకాణం నుండి ప్రత్యేకమైన ఆధాయం అంతగా వచ్చేది కాదు. అతి కష్టముగా కేవలం ఇల్లు గడిచేది. పదే పదే తహ్‌రీకే జదీద్ చందాను గూర్చి ప్రకటనలను వినేవారము. ఒక రోజు నా భార్య నాతో మనం ఒక గల్లా పెట్టే ఏర్పాటు చేసి అందులో ప్రతి రోజు కొన్ని రూపాయాలు దాచి పెడుదాము. అక్టోబర్ నెల చివరి వరకు ఎంత ప్రోగనైనను ఆ మొత్తాన్ని తహ్‌రీకే జదీద్ చందాగా చెల్లించాలి అని తన అభిప్రాయాన్ని తెల్పింది. గత సంవత్సరం వరకు మేము ఎన్నడు 20వేల

లేవన్ కంటే ఎక్కువ చందాను చెల్లించలేదు. కాని ఈ సంవత్సరం అల్లాహ్ తాలా అనుగ్రహం వలన రెండు లక్షల లేవన్‌కు పైగా చందాగా చెల్లించు భాగ్యమును పొందాము. నా సోదరులు కూడ ఈ విధానాన్నే అనుసరించారు. వారుకూడ ఒక లక్ష ముప్పై వేల లేవన్‌ను చందాగా చెల్లించు భాగ్యమును పొందారు. ఇలా ఆచరించినందుకు మరియు అల్లాహ్ తాలా ఈ సంవత్సరము  మాకు అధికముగా చందా చెల్లించు భాగ్యమును కల్పించినందుకు నా భార్య చాలా సంతోషముగా ఉన్నది. అలా చేయడం వలన మా త్యాగా స్ఫూర్తి కూడ పెరిగింది. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన మా ఆధాయం కూడ పెరిగింది. అల్లాహ్ తాలా మాకు నేర్పించిన ఈ విధానాన్నే మేము ఇక ముందు కూడ కొనసాగించెదము.

మార్షల్ ఐలాండ్ ఒక సుదూర ప్రాంతం. అమెరికా కంటే దూరముగా ఉంటుంది. అక్కడి ముబల్లిఘ్ సాజిద్ ఎక్బాల్ గారు ఈ విధముగా వ్రాసారు: మార్షల్ ఐలాండ్‌లో నాసిర్ క్యోషి  ఆకన్ గారు ఉన్నారు. ఈ ఆర్థిక  సంవత్సరం జమాఅత్ సభ్యుల నుండి తహ్‌రీకే జదీద్ వాగ్దానాలు తీసుకొనుచుండగా, క్యోషి గారు ఈ విధముగా అన్నారు: ప్రస్తుతం నాకు ఎలాంటి ఉద్యోగం లేదు, ఉండడానికి ఇల్లు కూడ లేదు. భోజనానికి కూడ నేను జమాఅత్ లంగర్ ఖానాకే వస్తున్నాను అని తెలిపారు. అందుకు మేము వారికి కొన్ని నెలల వరకు మస్జిద్‌లోనే ఉండుటకు అనుమతి ఇచ్చాము, ఆపై కొంతైన చందా వ్రాయించమని, ఈ విషయంలో సహాయం కోసం అల్లాహ్‌తో దుఆలు చేయమని కూడ తెలిపాము. అందుకు వారు రెండు అమెరికన్ డాలర్లను చందాగా వ్రాయించారు. కొన్ని నెలల తరువాత వీరు మరల మిషన్ హౌజ్‌కు వచ్చారు. ఆపై 50 డాలర్లను తహ్‌రీకే జదీద్ చందాగా చెల్లించారు. ఆపై వారు ఇలా తెలిపారు: అల్లాహ్ తాలా నా దుఆను ఆలకించాడు, నాకు ఉద్యోగం  వచ్చింది. ఉండడానికి ఒక అపార్ట్‌మెంట్ కూడ అద్దెకు తీసుకున్నాను. ప్రస్తుతం నా వంటలను నేను వండుకుంటున్నాను.  విశ్వాసాన్ని పటిష్టం చేయడం కోసం అల్లాహ్ తాలా ఏ విధముగా సహాయం అందిస్తాడో చూడండి. అట్టి దృశ్యాలను చూసినచో కొన్ని సందార్భలలో మన ముబల్లిఘ్‌లు కూడ ఆశ్చర్యపోతారు.

గేంబియా అమీర్ గారు ఈ విధముగా వ్రాసారు: బసే ప్రాంతంలో తహ్‌రీకే జదీద్‌ను ఉద్దేశించి ఒక కార్యక్రమము చేపట్టాము. చందా చెల్లించు విషయంలో వారిలో ఆసక్తిని పెంచాము. ఆ కార్యక్రమములో మూసా గారు కూడ పాల్గొన్నారు. చందాగా చెల్లించడం కోసం వారి వద్ద ఏమి లేకుండెను. చాలా ఆందోళనకు గురైనారు. తహాజ్జుద్ నమాజ్‌లో దైవానుగ్రహం కోసం, దైవ మార్గంలో ఖర్చుచేయు భాగ్యం లభించిన వారిలో పరిగణింప బడడం కోసం  ప్రతి రోజు దుఆలు చేసేవారు. మొత్తానికి అల్లాహ్ తాలా వారి ఆకాంక్షను నెరవేర్చినాడు. కొన్ని రోజుల తరువాత వారు పని చేయుచున్న కంపెని వారు బసేప్రాంతంలో రెండు రోజుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు, అందులో పాల్గొనాలని, అందుకు ప్రతిఫలముగా వారికి నాలుగు వేల డెలాసిలు చెల్లిస్తామని చెప్పారు. అందుకు వీరు చాలా సంతోషించారు, ఆపై వారి కార్యక్రమములో పాల్గొన్నారు. ఆ తరువాత వారు తమ వాగ్దానాన్ని పెంచుతూ రెండువేల డెలాసీలను చందాగా చెల్లించారు. చందా చెల్లించుటకు అల్లాహ్ తాలా వారికి ఆధాయం పెంపు మార్గాలను కూడ ఏర్పాటు చేశాడు. అలా వారు ఇతర అహ్మదీయులను కూడ తహ్‌రీకే జదీద్ చందా చెల్లించాలని ప్రోత్సహించసాగారు.

| ఇమామ్ వాఖ్యములు | “ముస్లిములు పవిత్ర ఖుర్ఆన్‌ను సంపూర్ణముగా ఆచరించనంత వరకు వారెలాంటి అభివృద్ధి సా ధించరు” (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 379) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

తల్హా అలీ గారు ఫల్‌ఫైన్ సదర్ జమాఅత్‌గా మరియు ముబల్లిఘ్‌గా కొనసాగుచున్నారు. వారు ఇలా వ్రాసారు: ఫల్‌ఫైన్‌లో గల పురాతన జమాఅత్‌లలో సీమానోల్ జమాఅత్  ఒకటి. ఇక్కడి వారిలో అధికులు ఉపాధ్యాయ వృత్తిపై ఆధారపడి యున్నారు. అక్కడి జమాఅత్ సదర్ గారు తమ వసూలీ టార్గెట్‌ను పూర్తి చేసిన తరువాత  నాకు ఒక సందేశాన్ని పంపుచూ ఇలా అన్నారు: ముగ్గురు ఉపాధ్యాయుల కొరకు ప్రత్యేకించి దుఆలు చేయండి. ఎందుకనగా వారికి మార్చి నుండి జీతం రావడం లేదు. అయినా కూడ వారు ముగ్గురు తమ శక్తిని మించి తహ్‌రీకే జదీద్‌లో చందాను చెల్లించారు. త్యాగాల ద్వారా అల్లాహ్ తాలా ప్రీతిని పొందుటకు సుదూర ప్రాంతాలలో ఉన్నటు వంటి ప్రజలు కూడ ఏ విధముగా త్యాగాలు చేస్తున్నారో  చూడండి.

కబాబీర్ నుండి మన ముబల్లిఘ్ శంషోద్దీన్ గారు ఈ విధముగా వ్రాసారు: ఫలస్తీన్‌లో అల్ ఖలీల్ అనే ప్రాంతంలో నూతనంగా జమాఅత్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడి జమాఅత్ సభ్యులందరి ఆర్థిక పరిస్థితి చాలా బలహీనముగా ఉన్నది. అయినా కూడ అల్లాహ్ తాలా అనుగ్రహం వలన సభ్యులందరు తహ్‌రీకే జదీద్ చందాలో పాల్గొన్నారు. అట్టి ఖలీల్ జమాఅత్‌లో ఇబ్రాహీం సాహెబ్ అను ఒక నూతన అహ్మదీయ మిత్రుడు గలడు. వీరు బైఅత్ చేయడంతోనే తమ శక్తి మేరకు  చందాలు చెల్లించడం ప్రారంభించారు. ఈ సంవత్సరము కూడ వారు చాలా పెద్ద మొత్తాన్ని తహ్‌రీకే జదీద్ చందాలో చెల్లించారు. మరల ఆ మిత్రుడు ఇలా తెలిపారు: ఒక మిత్రుడు నా వద్ద అప్పు తీసుకున్నాడు. కాని ఏవో తప్పని పరిస్థితుల వలన నా అప్పు తీర్చలేక పోతున్నాడు. చాలా కాలం  నుండి అతడు నా బాకీ తీర్చుతాడని ఎదురుచూస్తు వచ్చాను. తహ్‌రీకే జదీద్ చందా నేను చెల్లించాలి,  పైగా కొన్ని సమస్యలు కూడ ఎదురయ్యాయి. నాకు రావలసిన డబ్బులు వచ్చే సూచనలు కూడ కనిపించడం లేదు. మొత్తానికి అమీర్ సాహెబ్‌ను కలిసినప్పుడు కొన్ని ఏర్పాట్లు చేసుకొని నా చందాను నేను చెల్లించాను. నా పరిస్థితిని చూసిన తరువాత స్వయముగా అమీర్ సాహెబ్ గారు ఈ విధముగా అన్నారు: మీరు తహ్‌రీకే జదీద్ చందాను దైవ మార్గంలో చెల్లించారు కావున ఇక మీ సమస్యలన్నింటిని అల్లాహ్ తాలాయే తీర్చుతాడు. తప్పకుండా శుభములను కల్పించుతాడు. మొత్తానికి నా దగ్గరి నుండి అమీర్ సాహెబ్ గారు వెళ్ళిన కొన్ని గంటలకే నాకు రావలసిన డబ్బును ఆ వ్యక్తి తీసుకవచ్చి నాకు అప్పగించాడు. అలా నా సమస్యలన్ని దూరమై పోయాయి.

జర్మనీలోని వేజ్‌బాదన్ జమాఅత్‌కు చెందిన ఒక మిత్రులు తహ్‌రీకే జదీద్ కార్యాలయానికి వచ్చి ఈ విధముగా తెలియజేశారు: నా జాతీయత కేసు ఒక న్యాయమూర్తి వద్ద ఉన్నది. అతడు ఎంతకు నాకు అనుమతినివ్వడం లేదు. ఆ మిత్రుడు తహ్‌రీకే జదీద్ కార్యక్రమాలలో పాల్గొని విశ్వాసభరిత ఘటనలను వినేవారు, అలా వారు ఒక వెయ్యి యూరోలను తహ్‌రీకే జదీద్ చందాలో చెల్లించెదనని వాగ్దానం చేశారు. మరల ఇలా తెలిపారు: అల్లాహ్ తాలా నా కేసును మొదటి న్యాయమూర్తి నుండి మరొక న్యాయమూర్తికి  అప్పగించాడు. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన నాకు జాతీయ గుర్తింపు లభించినది. కావున నేను అల్లాహ్ తాలాతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చుటకు వచ్చాను అని తెలిపారు. అలా వారు తమ వాగ్ధానం మేరకు తహ్‌రీకే జదీద్‌లో చందాను చెల్లించారు.

తహ్‌రీకే జదీద్ సెక్రటరీ యు.కే గారు ఈ విధముగా తెలిపారు:

| ఇమామ్ వాఖ్యములు | “ఇస్లాం నిజమైన విజ్ఞానమును ప్రసా దించును. తద్వారా మానవుని నేర జీవితము మృతి చెందును” (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 344) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)*

బ్రిటన్ జమాఅత్‌కు చెందిన ఒక మిత్రునికి ఎలాంటి పని లేకుండెను. తహ్‌రీకే జదీద్ చందా చెల్లించిన తదుపరి రోజు నుండే వారికి వారి అర్హతకు తగిన ఉద్యోగం లభించినది. అదే విధముగా బ్రిటన్ జమాఅత్‌కు చెందిన మరొక మిత్రునికి చాలా ఆర్థిక సమస్యలు ఉండేవి. అయినా కూడ వారు తహ్‌రీకే జదీద్ చందాను చెల్లించారు. అలా చెల్లించిన కొంత కాలానికి ఎచ్ఎమ్ఆర్‌సి ఆధాయ మరియు పన్నుల శాఖ నుండి వారికి ఒక లేఖ వచ్చింది. అందులో మీరు గత సంవత్సరం ఎక్కువ పన్నులు చెల్లించారు అని రాసి ఉంది. ఆ మొత్తం పన్నులు వారు చెల్లించిన చందా కన్న ఎక్కువ రెట్లు గలదు. మరొక మిత్రునికి తాను పని చేస్తున్న చోట కొన్ని సమస్యలు ఎదురైనాయి. కొందరు అనవసరముగా వారిపై ఫిర్యాదులు చేశారు. వారు తమ వాగ్దానం మేరకు తహ్‌రీకే జదీద్ చందాను చెల్లించారు. ఫలితముగా వారిపై ఫిర్యాదుచేసిన వ్యక్తి ఇతర కారణాల చేత ఉద్యోగం నుండి తొలిగించబడ్డాడు. అలా ఫిర్యాదు చేపిన వ్యక్తియే చివరికి అల్లాహ్ అనుగ్రహంతో ఉద్యోగం నుండి తీసివేయబడ్డాడు. మరొక మిత్రుని కారు అనుకోకుండా ఒక గుంతలో పడిపోయింది. ఆ కారుకు ఎలాంటి నష్టం జరుగకుండా బయటకు వచ్చినచో వాగ్ధానానికి మించి తహ్‌రీకే జదీద్ చందాను చెల్లిస్తాను అని సంకల్పించుకున్నాడు. మొత్తానికి అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వారి కారు ఎలాంటి నష్టం లేకుండా బయటకు తీయ బడింది. అందుకు ఆ మిత్రుడు ఒక వారం ఆధాయంను తహ్‌రీకే జదీద్ చందాగా చెల్లించాడు. ఒక బాలుడు తన ఆరు నెలల జేబు ఖర్చును తహ్‌రీకే జదీద్ చందాగా చెల్లించాడు. పిల్లలు కూడ ఆర్థిక త్యాగాలలో ముందుకు రావడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఒక యువకుడు సెలవులకు ఇంటికి వెళ్ళడం కోసం కొంత నగదును దాచుకున్నాడు. ఆ మొత్తం నగదును వారు తహ్‌రీకే జదీద్ చందాగా చెల్లించారు. బార్‌కింగ్ మరియు డోగన్‌హం జమాఅత్ సదర్ గారు ఈ విధముగా వ్రాసారు: ఈ సంవత్సరం తహ్‌రీకే జదీద్ చందా టార్గెట్‌ను ఎట్టి పరిస్థితులలోనైన పూర్తి చేయాలని, అవసరమైనచో తమ జేబులో నుండైన చెల్లించాలని చెప్పారు. మొత్తానికి వారు తమ వైపు నుండి కొంత మొత్తాన్ని కలిపి ఆ టార్గెట్‌ను పూర్తి చేశారు. ఆ తరువాత వారికి తన ఉద్యోగ కార్యాలయం నుండి ఒక సందేశం వచ్చింది. ఆ సందేశ సారంశమేమనగా, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 70% ఎక్కువ బోనస్ లభిస్తుంది అని గలదు. అలా వారు చందా కోసం ఇచ్చిన నగదు కంటే ఈ బోనస్ నగదు చాలా ఎక్కువ.

ఖజకిస్తాన్ నుండి లేనార్ అబ్దుర్రహ్మానావే గారు ఈ విధముగా వ్రాసారు: నేను క్రమం తప్పకుండా చందా ఆమ్, జల్సా సాలానా, తహ్‌రీకే జదీద్ మరియు వక్ఫేజదీద్ చందాలను చెల్లిస్తుంటాను. వివిధ ప్రాంతాలకు చెందిన వివిధ వ్యక్తులు వీరు. ఆ చందాల శుభముల వలన నాభార్య మెడికల్ కోర్సును పూర్తి చేసింది, ఫలితముగా ప్రభుత్వ ఉద్యోగం లభించినది. పైగా కుటుంబంతో ఉండడానికి ఇంటి అదెద్దను కూడ ప్రభుత్వం అప్పుగా ఇచ్చింది. పిల్లలు నర్సరిలో చదువుచున్నారు. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులు గతంలో కన్న బాగానే ఉన్నాయి. ప్రస్తుతం నా వద్ద రెండు వాహానాలు గలవు, ఇప్పుడు సొంతింటిని నిర్మించుకోవాలని ఆలోచిస్తున్నాను. ఇవన్ని అల్లాహ్ తాలా యొక్క అనుగ్రహములు, చందాల శుభములు. గతంలో మేము అద్దె ఇంట్లో ఉండేవారము, ఆర్థిక పరమైన ఇబ్బందులు కూడ ఉండేవి. అయినా కూడ మేము క్రమం తప్పకుండా చందా చెల్లించేవారము. వాటి వలన అల్లాహ్ తాలా అనుగ్రహాలు మాపై లెక్కలేనంతగా కురిసాయి.

ఘని బసావూ కు చెందిన మురబ్బి ముహమ్మద్ అహసన్ గారు ఈ విధముగా వ్రాసారు: ముహమ్మద్ ఇబ్రాహీం గారు అనే అహ్మదీయ మిత్రులు ఇలా తెలిపారు: గత సంవత్సరం నేను నూతన సంవత్సర ప్రకటన చేయగా వారు ఆ ప్రకటనను విని వాగ్ధానం వ్రాయించారు. జుమా ప్రసంగం విన్న తరువాత ప్రతి నెల క్రమం తప్పకుండా చందా చెల్లిస్తాను అని సంకల్పించు కున్నారు. వారి సంకల్పం మేరకు చందాను చెల్లించేవారు. కాని కరోన వలన వారి ఆధాయ మార్గాలు మూసుకపోయాయి. ఆ సమయంలో కొంత ఆందోళన కల్గింది. తహ్‌రీకే జదీద్ ఆర్థిక సంవత్సరం ముగిసిపోతున్న తరుణంలో ఆ ఆందోళన ఇంకా పెరిగింది. ఫలితముగా నేను దుఆలు చేయసాగాను. ఒకరోజు అనుకోకుండా ఒక మిత్రుని నుండి ఫోన్ వచ్చింది. వారు నిర్మాణ రంగానికి చెందిన బ్లాక్‌లు నిర్మించగలరా? అని అడిగారు. అందుకు నేను వెంటనే నిర్మించగలనని సమాధానం ఇచ్చాను. అలా ఇంట్లోనే ఉండి పని చేసుకునే అవకాశం లభించినది. ఆ పని వలన అల్లాహ్ తాలా నా వాగ్ధానాన్ని చెల్లించు మార్గమును నాపై తెరిచినాడు. లాక్‌డౌన్ వలన ఏర్పడిన ఆర్థిక ఇబ్బంధులు కూడ దూరమైపోయాయి. మరల ఇబ్రాహీం గారు ఇలా వ్రాసారు: ఈ శుభము లన్నియు వర్తమాన ఖలీఫా గారి పిలుపును మేరకు అనుసరించడం వలన లభించినవి.

రంజ్‌బార్ నుండి ముబల్లిఘ్ గారిట్లు తెలిపారని తన్జానియా అమీర్ గారిట్లు వ్రాశారు. ఒక పుణ్యాత్మురాలైన అహ్మదీ మహిళ ఆమినా బి బి గారు ప్రతి సంవత్సరము తమకు పరిమిత ఆధాయము వున్నను చందాల చెల్లింపులో ఎప్పటికి ముందుండేవారు. ఈ సంవత్సరము కూడ పవిత్ర రమజాన్ మాసంలో ధన త్యాగము గురించి పిలుపు ఇవ్వబడెను. కావున రమజాన్ మాసంలోనే వారు తమ వాగ్దానమును పూర్తి చేయుటకు చాలా కృషి చేసిరి. కాని ఆర్థిక ఇబ్బందుల వలన చెల్లించుటకు నగదు లభించ లేదు. వారిట్లు తెలిపిరి. ఒకరోజు నాకు ఈ విషయము చాలా బాధ కలిగించి నది. నేను రాత్రి నిద్ర లేచాను. అల్లాహ్ తఆలా ఆస్థానములో చాలా రోధిస్తు ఇట్లు వేడుకున్నాను. వర్తమాన ఖలీఫా పిలుపును అనుసరించ వలసిన సమయమిది. కాని నేను మాత్రం అనుసరించలేక పోతున్నాను వాపోయారు. దైవికముగా ఆ రోజు ఉదయమే ఒక అప్పుని నుండి ఫోన్ వచ్చింది. అతనిని చాలా కాలము నుండి మేము సంప్రదించలేక పోయాము. వారి అప్పుడు తన వైపు నుండి కొంత నగదును కానుకగా వారికి పంపించారు. దానితో వారు తమ చందాను చెల్లించారు. మరల వారు స్వయంగా ఇట్లు చెప్పారు. చందా చెల్లించి నందుకు అల్లాహ్ తఆలా ఎల్లప్పుడు నాతో ప్రేమపూర్వకంగా వ్యవహరించ సాగాడు, అతడు నన్ను ఎన్నడు ఒంటరిగా వదిలి పెట్ట లేదు.

ఖాదియాన్ నుండి వకీలుల్ మాల్ గారిట్లు వ్రాశారు. కేరళ జమాఅత్ కరులాయిలోని ఒక మిత్రులు తహ్‌రీకె జదీద్ చందా ఐదు లక్షలు వ్రాయించారు. వారు తమ ఫర్మ్ కొరకు ఫర్నీచర్ కొనుగోలు చేయుటకు కొంత నగదు నిల్వ వుంచుకున్నారు. నిర్ణీత సమయములో నగదు చెల్లించనిచో ఫర్మ్ వ్యాపారము మూతపడిపోయేది. కాని అదే సమయములో తహ్‌రీకె జదీద్ చందా చెల్లించాలని పిలుపు ఇవ్వబడెను. చందా ప్రాముఖ్యత వలన వారు చందా చెల్లించారు. ఈ వినమ్రత ఫలితంగా అల్లాహ్ తఆలా వారిని ఎంతగా కరుణించాడనగా అతి తక్కువ సమయములోనే చందాలో చెల్లించిన నగదు కంటే ఎక్కువ రెట్లు అధికనగదు వారి ఖాతాలో జమా చేయబడింది. అలా వారు ఫర్మ్ కొరకు అవసరమున్న సామాగ్రి మొత్తాన్ని తెప్పించుకున్నారు. అనంతరం వారికి చాలా పెద్ద మొత్తంతో కూడిన ఒక ప్రాజెక్టు టెండర్ లభించినది. అది మిలియన్ రూపాయల ప్రాజెక్టు. తద్వారా వారు తమ వాగ్దానమే కాక అధిక నగదు అనగా సుమారు 12 లక్షల రూపాయలను తహ్‌రీకె జదీద్ చందాగా చెల్లించారు.

| ఇమామ్ వాక్యములు | "ముస్లిములు పవిత్ర ఖుర్ఆన్‌ను సంపూర్ణముగా ఆచరించనంత వరకు వారెలాంటి అభివృద్ధి సాదించరు" (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 379) |
|---|---|

SUFI AHMAD Sb. Jama'at Ahmadiyya Penugonda, Dist: West Godawari (Andhra Pradesh)

భారత దేశము నుండే అబ్దుల్ వాహిద్ ఇన్స్‌పెక్టర్ గారు ఇట్లు వ్రాశారు. కేరళలోని ఒక జమాఅత్ కొచ్చిన్‌లో తహ్రీకె జదీద్ గురించి ఒక సభ ఏర్పాటు చేయడం జరిగింది. అందులో తహ్రీకె జదీద్ ఉద్దేశముల గురించి తెలుపబడెను. ధన త్యాగములో పాల్గొనాలని జమాఅత్ సభ్యులకు సూచించబడెను. సభ ముగిసిన తర్వాత మేము సదర్ జమాఅత్ గారి ఇంటికి వెళ్ళాము. అక్కడ సదర్ గారి కుమార్తె, ఎనిమిది సంవత్సరముల వయస్సు ఉంటుంది. తమ గల్ల గురిగిని తీసుక వచ్చి మౌల్వీ గారు! ఇందులో వున్న నగదు మొత్తమును మీరు చందా తహ్రీకె జదీద్‌లో తీసుకోండని అనెను. అప్పుడు ఆమె గల్లగురిగిలో సుమారు 864 రూపాయలు వుండెను. అలా ఆ బాలిక ఆ నగదు మొత్తాన్ని చందా తహ్రీకె జదీద్‌లో చెల్లించినది. నా కుమార్తె చాలా కాలము నుండి ఈ నగదును చందా తహ్రీకె జదీద్‌లో చెల్లించు ఉద్దేశముతో సమకూరుస్తుందని ఆమె తండ్రి కూడ చెప్పారు. తండ్రి ఇట్లు తెలిపిరి. నేను నా దుకాణము నుండి తిరిగి వచ్చినప్పుడు నా కూతురు నా జేబులో వున్నటువంటి చిల్లర నగదును తీసుకొని సమకూర్చు కునేది. నా నుండి చిల్లర నగదును తీసుకొని తన గల్లగురిగిలో వేసుకునేది. అలా ఆ అమ్మాయి కొన్ని నెలల వరకు సమకూర్చుకున్న నగదును చందాలో చెల్లించినది. ఈ ధన త్యాగ స్ఫూర్తిని అల్లాహ్ తాలాయే అహ్మదీ పిల్లల్లో అల్లాహ్ తఆలా కల్పించాడు.

బైఅత్ ప్రతిజ్ఞ చేసిన తర్వాత త్యాగ స్ఫూర్తి ఎలా కల్గుతుందో చూడండి. ఈ సంఘటనను సమద్ గారు అల్బానియా నుండి వ్రాస్తున్నారు. అల్బానియా లోని ఒక గ్రామములో నివాసముంటున్న దాలీబ్ జర్జీ గారు ప్రాంతీయులే. (అనగా అల్బానియా దేశస్తులే) ఒక రోజు జుమా తర్వాత భేటీ అయినారు. వీరు పదవి విరమణ పొందారు. తక్కువ ఆదాయమున్నను ప్రతి నెల క్రమం తప్పకుండా చందా చెల్లిస్తుంటారు. వీరికి స్వంత వాహనము సైతం లేదు. ప్రజా రవాణాలో జుమా కొరకు వస్తుంటారు. ప్రస్తుత మహమ్మారి వలన చాలా కాలము తర్వాత జుమా కొరకు వచ్చారు. వారు జుమా తర్వాత ఇట్లన్నారు. ఇన్ని నెలల నుండి చందా చెల్లించనందుకు మనసు భారమైపోయినది. కావున ఈ ఎనిమిది నెలల చందా తీసుకొచ్చాను. చందా ఆమ్‌తో పాటు చందా తహ్రీకె జదీద్, చందా వఖ్ఫె జదీద్ కూడ చెల్లించారు. ఇటువంటి అనేక ఉదాహరణలు గలవు. ఉదా॥ తన్జానియా నుండి ఒక ముఅల్లిమ్ హుసేన్ గారిట్లు వ్రాశారు. ఒక మంచి సత్యమూర్తులైన అహ్మదీయులు సాలిహ్ మటోంగా గారు. ధన త్యాగములో ఆనందముగా అహమహమికతో పాల్గొంటారు. కొంత కాలము క్రితం అనారోగ్యానికి గురైనారు. చికిత్స కొరకు వారి వద్ద నగదు లేకుండెను. కాని వారికి పెన్షన్ డబ్బులు లభించినప్పుడు వారు మొట్ట మొదట తహ్రీకె జదీద్ వాగ్దానము మేరకు మొత్తం చందా చెల్లించారు. మీరు ఈ నగదుతో తమ చికిత్స చేయించుకోండి, తర్వాత తమ చందా చెల్లించండని నేను వారికి చాలా వరకు నచ్చ చెప్పాను. స్వస్థత కలిగించేది అల్లాహ్ తఆలా ఉనికియే. కావున నేను మొదట అల్లాహ్ తఆలాతో చేసిన వాగ్దానమును పూర్తి చేస్తాను. తర్వాత చికిత్స చేయించుకుంటాను. త్యాగములో ఇవి విచిత్ర ప్రమాణములు. ఆశ్చర్యము కలుగుతుంది. సుదూర ప్రాంతములలో నివసిస్తున్న క్రొత్తగా చేరిన వారిలో కూడ ఈ ప్రాధాన్యతను అల్లాహ్ తఆలా ఎలా స్పష్టము చేసాడో చూడండి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన తర్వాత అల్లాహ్ తఆలా వీరిలో ఎంతటి విప్లవము సృష్టించాడో చూడండి.

గేంబియా అమీర్ గారిట్లు వ్రాశారు. తహ్రీకె జదీద్ పిలుపుల గురించి ఒక కార్యక్రమము నిర్వహించబడెను. జీవితమును సమర్పించుట, సాధారణ జీవితము గడుపుట, చిన్న చిన్న విషయములలో సైతం సంకోచించకూడదని ఈ కార్యక్రమములో సూచించబడెను. ఈ కార్యక్రమము తర్వాత ఒక మిత్రులు ఇబ్రాహీమ్ గారిట్లు తెలిపారు. నేను ఒక వెయ్యి దలాసీ రూ॥లను చందా తహ్రీకె జదీద్‌లో చెల్లిస్తున్నాను. మరల వారు ఇలా తెలిపారు: నా ఒక్కగానొక్క కుమారుణ్ణి జీవితము సమర్పన చేయించి మురబ్బి సిల్సిల కొరకుకు పంపిస్తున్నాను. ప్రస్తుతం వారి కుమారుడు సెకండరీ పాఠశాలలో వున్నాడు. ఇది వారి సంకల్పము. అతడు మురబ్బి అగును గాక! ఇన్ షా అల్లాహ్.

అదే విధంగా ఘూనా లోని ఇక్రా జోన్ జనరల్ సెక్రెటరి ఆదమ్ గారిట్లు వ్రాశారు. జోనల్ సదర్ గారు నా ఖర్చుల కొరకు 50 ఘూనా సిటి రూ॥లను ఇచ్చారు. నేను ఆ నగదును చందా తహ్రీకె జదీద్‌లో చెల్లించాను. మరుసటి రోజు నేను నా అధికారితో కలిసి ఒక పని మీద బయటికి వెళ్ళాను. తిరిగి వస్తుండగా ఇంటికి ఎలా వెళ్తారని అధికారి నన్ను అడిగెను. అందుకు ట్యాక్సీ ద్వారా వెళ్తానని నేను చెప్పాను. అప్పుడు ఆ అధికారి నా ఫోన్ అడిగి, ఒక్కసారి ఫోన్ చెక్ చేసుకో అని అన్నారు. నేను చెక్ చేయగా ఒక వెయ్యి సిటి రూ॥లు నాకు ఫోన్ ద్వారా పంపించారు. వారు మొబైల్ ద్వారా నాకు పంపించారు. నేను 50 సిటి రూ॥ చందాగా చెల్లించగా, బదులుగా నాకు వెయ్యి సిటి రూ॥లు లభించాయి. ఇటువంటి కొన్ని సంఘటనలను నేను తెలిపాను. ఇంకా అనేక సంఘటనలు నా వద్ద వున్నాయి. అల్లాహ్ తఆలా త్యాగము చేసిన వారి ధనము, కుటుంబములో అంతులేని శుభము కలిగించుగాక!

ఈ త్యాగము పూర్తిగా ఎంత వరకు సమర్పించబడినదో కొన్ని వివరములు తెలుపుతాను. ఎందుకనగా తహ్రీకె జదీద్ ప్రకటనలో వివరములు తెలుపబడుతాయి. అల్లాహ్ తఆలా కృపానుసారము తహ్రీకె జదీద్ 86వ సంవత్సరము 31 అక్టోబర్ తేదీన ముగిసి 87వ సంవత్సరము ప్రారంభమైనది. అల్లాహ్ తఆలా కృపానుసారము ప్రపంచవ్యాప్త అహ్మదియ్య జమాఅత్ తహ్రీకె జదీద్ ఆర్థిక విభాగములో 14.5 మిలియన్ అనగా ఒక కోటి 45 లక్షల పౌండ్ల త్యాగము సమర్పించుకొను అనుగ్రహము పొందినది. ఈ వసూలు గత సంవత్సరం కంటే 8 లక్షల 82 వేల పౌండ్లు కంటే అధికం. ఈ సంవత్సరం ప్రపంచ వ్యాప్త జమాఅత్‌లలో జర్మని మొదటి స్థానములో నిలిచినది. పాకిస్తాన్ ఆర్థిక, రాజకీయ స్థితులు చాలా దిగజారిపోతున్నాయి. ప్రపంచ జమాఅత్‌లకు పోటీగా కాకున్నను పాకిస్తాన్ జమాఅత్‌లు తమ దేశ కరెన్సీని బట్టి చాలా అభివృద్ధి చెందాయి. మంచి త్యాగములు చేశాయి. ఏ ఏ దేశములలో ఆర్థిక, రాజకీయ పరిస్థితులు దిగజారిపోయావో అక్కడ కూడ శాంతి, ప్రశాంతతను అల్లాహ్ తఆలా కలిగించుగాక! మెరుగుపరచుగాక! తద్వారా వారు కూడ త్యాగములు సమర్పించుకొనుటకు అనుగ్రహము పొందుదురు గాక! ఏది ఏమైనప్పటికి మొత్తమ్మీద ప్రపంచ వ్యాప్తముగా జర్మని ప్రథమ స్థానములో వున్నది. అనంతరం ఇంగ్లాండ్, అమెరికా. విదేశి దేశములలో పాకిస్తాన్ కూడ మధ్యలో వుంటుంది. కావున అమెరికా మూడవ స్థానములో వుంది. అనంతరం ఒక మిడిల్ ఈస్ట్ దేశమున్నది. తర్వాత భారత దేశము, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఘూనా, అనంతరం మరల మరొక మిడిల్ ఈస్ట్ దేశమున్నది. ఘూనా కూడ ఆఫ్రికాలోనే పోటీగా వుండకుండా బయటికి వెళ్ళి ప్రపంచ స్థాయి త్యాగములో చేరినది. ఇది అమెరికా, యూరప్‌తో పాటు ఇతర దేశములను కూడ ఎదుర్కొంటుంది.

అదే విధంగా తల సరి చెల్లింపుల ప్రకారం స్విట్జర్‌ల్యాండ్ ప్రథమ స్థానములో వున్నది. అనంతరం అమెరికా, సింగపూర్. ఇవి మూడు జమాఅత్‌లు. మిగతా వివరములు ఇంకా వున్నాయి.

ఆఫ్రికా దేశములలో మొత్తం వసూలు పరంగా ప్రథమ స్థానంలో ఘూనా వుండగా అనంతరం నైజేరియా, తన్జానియా, గేంబియా, సీరాలియోన్ వున్నాయి. సీరాలియోన్ చాలా పెద్దది, పాత జమాఅత్. ఇక్కడి అమీర్ గారు, ఇంకా సంబంధిత అధికారులు ప్రయత్నించవలెను. సరియైన పద్ధతిలో ధన త్యాగము గురించి జమాఅత్ సభ్యులకు పిలుపునివ్వాలి. ప్రజలు త్యాగమునకు సిద్ధముగా వున్నారు. కావున వీరు దృష్టి సారించవలెను. అనంతరం బేనిన్ వుంది. అల్లాహ్ తఆలా కృపానుసారము వీరు చాలా కృషి చేశారు. నైజేరియా, బేనిన్‌లో తలసరి చెల్లింపులలో చాలా పెరుగుదల అయినది. బేనిన్‌లో స్థానిక కరెన్సీ ప్రకారము తలసరి చెల్లింపులలో 6 శాతం పెరుగగా నైజేరియాలో 8 రెట్లు పెరిగినది. పరిస్థితుల వలన చందాదారుల సంఖ్య తక్కువ వుండెను. అయినను మొత్తం వసూలైన

నగదు గత సంవత్సరం కంటే ఎక్కువున్నది లేదా సమానంగా వుంది. చందాదారుల మొత్తం సంఖ్య 16 లక్షల 8 వందలు. చందాదారులను పెంచిన దేశాలలో చెప్పుకోదగ్గ ఆఫ్రికా దేశములలో మొదటి స్థానంలో ఘానా వుంది. అనంతరం బుకీనాఫాసు, మాలీ, సెనిగాల్, గేంబియా, కన్వాసా, తన్జానియా, లైబెరియా, కెన్యా, సెంట్రల్ ఆఫ్రికా, సౌతోమే, కాంగో బ్రాజీల్, జింబాబ్వే. ఇతర పెద్ద జమాఅత్‌లలో బంగ్లాదేశ్, జర్మనీ, భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లోని చందాదారులు కూడ పెరిగినారు.

ప్రథమ కార్యాలయములోని చందాదారుల సంఖ్య 5927. వీరిలోని 33 మంది సజీవంగా వున్నారు. వారు తమ చందా స్వయంగా చెల్లిస్తున్నారు. ఇంకా 3119 చందాదారుల చందా వారి వారసులు చెల్లిస్తున్నారు. మిగతా 2775 చందాదారుల చందా జమాఅత్‌లోని వినమ్రులు చెల్లిస్తున్నారు.

జర్మనీలోని మొదటి పది జమాఅత్‌లు ఇట్లు గలవు. ప్రపంచ వ్యాప్తంగా జర్మనీ మొదటి స్థానములో వున్నందున మొదట జర్మనీ వివరములు ప్రస్తావించబడును. జర్మనీలోని మొదటి పది జమాఅత్‌లు. మహ్దీఆబాద్ ప్రథమ స్థానం, అనంతరం రోడర్ మార్క్, నోయిస్, నిదా, కోలోన్, పిన్నేబర్గ్, ఓస్నాబ్రూక్, ఫ్లూవర్జ్ హాయిమ్, కీల్, ఫ్రంజ్ హాయిమ్‌తో ఇంకా మూడు లోకల్ జమాఅత్‌లు హేంబర్గ్, ఫ్రంక్‌ఫర్ట్, గ్రూస్ గెరావ్, వీజ్‌బాన్, మోర్ ఫిల్డన్, మన్‌హాయిమ్, రెడ్ షిటెడ్, రూసల్స్ హాయిమ్, డామ్ షిటెడ్.

తర్వాత రెండవ స్థానంలో ఇంగ్లాండ్ వుంది. ఇంగ్లాండ్ లోని జమాఅత్‌ల స్థానాలు ఇట్లు గలవు. బైతుల్ ఫుతూహ్ రీజన్ మొదటి స్థానంలో వుండగా అనంతరం మస్జిద్ ఫజల్ రీజన్, ఇస్లామాబాద్ రీజన్, మిడ్‌ల్యాండ్‌స్ రీజన్, బైతుల్ ఇహ్సాన్ రీజన్. మొత్తం వసూలుపరంగా ఇంగ్లాండ్‌లోని మొదటి పది జమాఅత్‌లు ఇట్లు గలవు. ఆల్డర్‌షాట్, ఇస్లామాబాద్, మస్జిద్ ఫజల్, వ్వస్టర్ పార్క్, బర్మింగమ్ సౌత్, బర్మింగమ్ వెస్ట్, చీమ్. మొత్తం వసూలు పరంగా ఇంగ్లాండ్‌లోని మొదటి ఐదు చిన్న జమాఅత్‌లు ఇట్లు గలవు. స్పేయిన్ వ్యాలి, కేథ్లే, స్వాన్జీ, నార్త్ వీల్స్, నార్త్ హేంప్‌టన్.

మొత్తం వసూలు పరంగా అమెరికా పట్టిక నా ముందు వుంది. కాని నా దృష్టిలో మొదట పాకిస్తాన్ వివరములు తెలుపవలెను. పాకిస్తాన్‌లోని జమాఅత్‌ల వివరములు ఇట్లు గలవు. లాహోర్ ప్రథమ స్థానంలో వుంది. రబ్వా రెండవ స్థానంలో కరాచి మూడవ స్థానంలో వుండగా జిల్లా స్థాయిలో ఎక్కువ త్యాగములు సమర్పించిన పది జిల్లాలు ఇట్లు గలవు. వీటిలో ఇస్లామాబాద్, సియాల్కోట్, గుజ్రాత్, గుజ్రాన్‌వాలా, హైద్రాబాద్, మీర్‌పూర్ ఖాస్, ఫైసల్ ఆబాద్, టోబా టేక్ సింగ్, ఎమర్ కోట్, చక్వాల్, కోట్లీ. చక్వాల్, కోట్లీ రెండు విడి విడిగా వుండవలెను. ఎందుకు కలిసి వున్నాయో తెలియదు. లేదా ఈ రెండు ఒకే స్థానములో వుండవచ్చును.

వసూలు పరంగా ఎక్కువ త్యాగము చేసిన పట్టణ జమాఅత్‌లు ఇట్లు గలవు. అమారత్ డిఫెన్స్ లాహోర్, అమారత్ రావల్పిండీ పట్టణము, అమారత్ దర్గ్ రోడ్ కరాచీ, అమారత్ ముఘల్‌పురహ్ లాహోర్, అమారత్ టౌన్‌షిప్ లాహోర్, అమారత్ అజీజ్ ఆబాద్ కరాచి, అమారత్ గుల్షన్ ఆబాద్ కరాచి, పేశావర్, కోయిటహ్, అమారత్ దిల్లి గేట్ లాహోర్.

అమెరికా జమాఅత్‌లలో మేరీల్యాండ్ ప్రథమ స్థానంలో వుంది. అనంతరం లాస్ ఏంజలిస్, సిలికాన్ వ్యాలి, సెంట్రల్ వర్జీనా, సియాటిల్, ఓష్ కోష్, డిట్రాయిట్, చికాగో, సౌత్ వర్జీనా, హ్యూస్టన్, అట్లాంటా, బూస్టన్.

మొత్తమ్మీద వసూలు పరంగా కెనడాలోని లోకల్ అమారత్‌లలో ప్రథమ స్థానంలో వాన్ అనంతరం పీస్ విలేజ్, కేల్గిరి, వింకోవర్, టొరాంటో వెస్ట్, మిస్ సాగా, బ్రహ్మటన్, బ్రహ్మటన్ ఈస్ట్, సిస్కాటోన్, టొరాంటో. కెనాడాలోని చిన్న జమాఅత్‌లలో బ్రెడ్ ఫోర్డ్, హెమిల్టన్, మౌంటెయిన్, ఎడ్‌మిన్టన్ వెస్ట్, రజాయినా, హేమల్టన్ ఈస్ట్.

త్యాగము పరంగా భారత దేశములోని మొదటి పది జమాఅత్‌లు ఇట్లు గలవు. కోయంబత్తూర్ ప్రథమ స్థానంలో వుండగా అనంతరం కరులాయి, ఖాదియాన్, పత్తపిరియమ్, హైద్రాబాద్, కన్నూర్ టౌన్, కోల్కాతా, కాలికట్, బంగళూరు, మాథోటమ్. మొదటి పది రాష్ట్రములు ఇట్లు గలవు. కేరళ ప్రథమ స్థానంలో వుండగా అనంతరం తమిళనాడు, కర్ణాటక, జమ్ము కాశ్మీర్, తెలంగాణ, పంజాబ్, ఒడిశా, బంగాల్, ఢిల్లి, మహారాష్ట్ర.

ఆస్ట్రేలియాలోని మొదటి పది జమాఅత్‌లు ఇట్లు గలవు. మెల్‌బోర్న్, లాంగ్‌వారన్, కాసిల్ హిల్, మెల్‌బోర్న్ బేరూక్, మార్సడన్ పార్క్, ఎడిలాయిడ్ సౌత్, పీన్ రథ్, ఎ.సి.టి కేంబ్రా, ఎడిలాయిడ్ వెస్ట్, మౌంట్ డ్రూయిట్, పేరామాటా.

ఇవన్ని జమాఅత్‌ల వివిధ వివరములు. అల్లాహ్ తఆలా వీరందరి ధనము, కుటుంబములో అంతులేని శుభములు కలిగించుగాక! వీరి త్యాగములను ఆమోదించుగాక! ఇంతకు ముందు చెప్పినట్లు ఇప్పుడు నేను తహ్రీకె జదీద్ 87వ సంవత్సరం ప్రారంభమును ప్రకటిస్తున్నాను. నవంబర్ మొదటి తేదీ నుండి ప్రారంభమగును. ఇన్ షా అల్లాహ్.

ఇప్పుడు నేను మరొక విషయము వైపు సూచించదలచాను. ప్రస్తుతం చాలా దుఆలు చేయవలసిన అవసరమున్నది. దుఆల వైపు దృష్టి సారించండి. మనము మన కొరకు, జమాఅత్ కొరకు దుఆలు చేస్తుంటాము. ముస్లిముల కొరకు కూడ తరచుగా దుఆలు చేయవలసిన అవసరమున్నది. ఈ రోజులలో ముస్లిములకు విరుద్ధంగా ముస్లిమేతర దేశముల నాయకులు చాలా అసూయ, కుట్రాభావములు కలిగి వున్నారు. ఈ నాయకులు ఈ ప్రజా స్వామ్య కాలములో ప్రజలనే దేవుళ్ళుగా భావిస్తు వారి కోరికల మేరకు తమ వ్యాఖ్యానములు, ప్రణాళికలను రూపొందించుటకు ప్రయత్నిస్తున్నారు. లేదా వారే స్వయంగా ప్రజలను తప్పుదోవ పట్టించి దేవుడు లేదు, మీరే సర్వం అనే రీతిలో మార్గదర్శనము చేస్తున్నారు. బహిర్గతముగా వ్యాఖ్యానము చేయని ప్రాంతాల నాయకుల హృదయాలలో కూడ ఇస్లాంకు వ్యతిరేకమైన భావాలు, ద్వేషములు నిండియున్నాయి. సాధారణ ప్రజలకు ఇస్లాం పట్ల సరియైన అవగాహన లేనందున వారు కూడ ముస్లిములకు వ్యతిరేకంగా వున్నారు. ఏది ఏమైనప్పటికి మనము దుఆలు, ప్రయత్నములతో పాటు ఇస్లాం వాస్తవికతను ప్రజలకు తెలియజేయాలి. కొన్ని రోజుల క్రితం ఒక పశ్చిమ నాయకుని వ్యాఖ్యానము బహిర్గతముగానే వెలువడినది. సాధారణంగా ఇలాంటి ప్రకటనలు పరోక్షముగా వస్తూనే వుంటాయి. రాజకీయంగా ఇటువంటి ప్రకటనలు, వ్యాఖ్యానములు లేదా అనుమానాస్పద పదములలో వెలువడుతూనే వుంటాయి. కాని ఈ విషయములో ఒక నాయకుని నుండి బహిరంగ ప్రకటన వచ్చిందంటే అది కేవలం ఫ్రాన్స్ అధ్యక్షునిది మాత్రమే. ఇస్లాంను కల్లోల మతమని అతడు ప్రకటించాడు. వాస్తవానికి వారి మతమే కల్లోల మతము. వారు ఏ మతమును నమ్మనే నమ్మరు. క్రైస్తవ మతమును వారెప్పుడో విస్మరించారు. వారే పీడనములకు గురైనారు. అల్లాహ్ తఆలా కృపానుసారము ఇస్లాం మాత్రమే సజీవ మతము. ఇదే ఫలములను ఇస్తుంది. అల్లాహ్ తఆలా అన్ని కాలములో దీని రక్షన బాధ్యతను తీసుకున్నాడు. ఈ కాలములో కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా దీని ప్రచారము ప్రపంచములో నలువైపుల వ్యాపిస్తుంది. వాస్తవమేమనగా ముస్లిములలో ఐక్యత లేదని వారికి తెలిసినందుకే ఈ ఇస్లాం వ్యతిరేక శక్తులు లేదా ప్రజలు ఇటువంటి పనులకు పాల్పడుతూ ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారు. కెనడా ప్రధాన మంత్రి గురించి ప్రశంసనీయమైన విధానములో నేను ప్రస్తావించదలచాను. వారు ఫ్రాన్స్ అధ్యక్షుని ప్రకటనకు స్పందిస్తూ ఈ తప్పుడు విధానం, ఇలా జరగకూడదని, ఒకరు మరొకరి భావములను, ధార్మిక మనోభావాలను, ధార్మిక నాయకులకు మరొకరు గౌరవించాలని మంచిగా చెప్పారు. ప్రపంచములోని మిగతా నాయకులు కూడ కెనడా ప్రధాన మంత్రి వలే ఆలోచిస్తూ, వ్యాఖ్యానిస్తూ గౌరవించినచో బాగుండును. ప్రపంచ శాంతి, సామరస్యతలను నెలకొల్పుటకు అందరు పై విధానంను ఆచరించవలెను. మొత్తానికి కెనడా ప్రధాన మంత్రి ఈ రకంగా చాలా ప్రశంసలకు అర్హులు. వారి కొరకు మనము కూడ దుఆలు చేయవలెను. అల్లాహ్ తఆలా వారికి

మరింత స్పష్టత ప్రసాదించుగాక!.

మొత్తానికి ముస్లిములలో ఐక్యత లేదనే విషయము అందరికి తెలిసినదే. అందుకే ఇవన్ని జరుగుతున్నాయి. ముస్లిముల ప్రతి దేశము మరొక దేశమునకు వ్యతిరేకంగా వుంది. వర్గపోరు, ముస్లిములలో విభేదము వున్నదని బయటి ప్రపంచానికి దీనితో స్పష్టమైపోయినది. ముస్లిములు ఒక్కటని, ఒక్క దేవుణ్ణి, ఒకే ప్రవక్తను నమ్ముతారని, అతని కొరకు త్యాగములు చేస్తూ, ప్రాణాలు అర్పిస్తారని ప్రపంచానికి తెలిసిపోయినచో ముస్లిమేతరులు ఇటువంటి చర్యలకు ఎన్నడు పాల్పడరు. ఏ పాత్రికేయుడు కూడ ఎన్నడు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చిత్రపటములు ముద్రించుటకు సహసించడు. కొన్ని సంవత్సరముల క్రితం డెన్మార్క్‌లో, ఫ్రాన్స్‌లో కూడ కొన్ని చిత్రపటములు ముద్రించ బడినవి. ప్రజలు ఒక తాత్కాలిక ఉత్సాహముతో అల్లరి చేసి, వారి వస్తువులను నిషేధించి, కొనకూడదని ప్రకటించి ఏమి జరుగనట్లు మౌనము పాటించి కూర్చుంటారు. కొన్ని నెలల తర్వాత మౌనము దాల్చి కూర్చుంటారు. అప్పుడు కూడ అహ్మదియ్య జమాఅత్ మాత్రమే సరియైన విధముగా స్పందిస్తూ, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అందమైన జీవితమును ప్రపంచానికి పరిచయం చేసింది. ఆ కార్యక్రమమును ఇతరులు చాలా మంది, విద్యావంతలు శ్రేణి, నాయకులు, సాధారణ ప్రజలు పొగిడినారు, మెచ్చుకున్నారు. ఈ పనినే మరల మనము నేడు కూడ చేస్తున్నాము. కొందరు మూర్ఖులు చేస్తున్న తప్పుడు పనులకు ఇస్లాం అని పేరు పెట్టకండని ప్రజలకు మేము చెప్తున్నాము. ఒక వ్యక్తి చేసిన తప్పుడు పనులను ఇస్లాం బోధనలతో ముడిపెట్టడం ఏ దేశ అధ్యక్షుడికి అర్హత లేదు. పైగా ముస్లిములను అల్లరిమూకలని నామకరణం చేసి తమ ప్రజలను మరింత రెచ్చగొట్టు కార్యక్రమాలు చేస్తూ అనంతరం వారికి విరుద్ధంగా ఇది మన యుద్ధము, ఈ యుద్ధమును మేము కొనసాగిస్తామని ప్రకటించుట ఒక దేశ అధ్యక్షునికి తగదు. ఆ వ్యక్తిని తప్పుడు పనికి ఉసిగొల్పిన వారు కూడ వీరే. ఇలా చిత్రపటములు గీసుట, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఏదో ఒక విధముగా అవమానపర్చుటకు ప్రయత్నించడం వంటి వాటిని పౌరుషం గల ఏ ముస్లిం భరించలేడని నేనింతకు ముందు కూడ చెప్పాను. ఇటువంటి పనులు కొందరు ముస్లిముల మనోభావాలను రెచ్చగొడతాయి. రెచ్చగొడుతున్నాయి. అలాంటప్పుడు ఆ వ్యక్తి చట్టమునకు విరుద్ధంగా ఏదేని పనికి పాల్పడినచో లేదా ఆ వ్యక్తి చట్టమును తన చేతిలో తీసుకుంటే దానికి బాధ్యులు ఈ ముస్లిమేతరులే, ఈ ప్రభుత్వములే లేదా ఈ నామమాత్రపు స్వాతంత్రము. దీనిని ఫ్రీడమ్ ఎక్స్‌ప్రెశన్ అనగా స్వేచ్ఛాభిప్రాయము అని అంటున్నారు. ఏదిఏమైనప్పటికి ఈ ముస్లిమేతర ప్రపంచము ముస్లిముల మనోభావాలను రెచ్చగొడుతుంది. గతంలో ఇలాంటి సమస్య తలెత్తినప్పుడు కూడ మనం ఏ విధముగా స్పందించాలో జుమా ప్రసంగాలలో వివరించాను. ఏ విధముగా ఖండించాలి?, ఏ విధముగా విరోధించాలి? తెలియజేశాను. వాటి వలన ప్రజలపై కూడ చాలా మంచి ప్రభావం పడిండిందని నేను గతంలో కూడ తెలిపాను. ఇప్పటి వరకు మనము ఆ విధానమునే కొనసాగిస్తూనే వున్నాము. ఆ పరంపరనే అవలంభిస్తున్నాము.

హాలేండ్‌లోని రాజకీయ వేత్తలు ఇలాంటి ఒక ప్రకటన చేసినప్పుడు, నేను హాలేండ్‌లో కూడ ఒక ఖుత్బా ప్రసంగించాను. దైవ శిక్షకు భయపడమని ఆ దేశాన్ని హెచ్చరించాను. అప్పుడు ఆ వ్యక్తి వీరు నన్ను బెదిరిస్తున్నారని నాపై హాలేండ్ ప్రభుత్వమునకు ఒక వినతి పత్రాన్ని కూడ అందజేశాడు. అందులో వారిని హాలెండ్‌కు రాకుండా నిషేధించాలని, వారిపై వాజ్యము మోపాలని హాలేండ్ ప్రభుత్వమునకు విన్నవించుకొనెను. ఏది ఏమైనప్పటికి సాధ్యమైనంత వరకు చట్ట పరిధిలో వుంటూ ఇస్లాం, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గౌరవానికి భంగం కల్గించే ప్రతి చర్యకు సమాధానమిస్తాము. ఇస్తూ ఉంటాము. ఆ సమాధానాలు ప్రభావము కూడ చూపుతాయి. చట్ట పరిధిలో ఉంటూ తదుపరి కార్యక్రమాలు చేపట్టాలి. అన్నింటిని మించి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్ పంపవలెను. దుఆలు చేయవలెను. గత అనేక ఖుత్బాలలో ఇందుకు పిలుపునిచ్చాను. అహ్మదియేతర విద్యావంతులు మనకు వ్యతిరేకంగా తీవ్రమైన వ్యాఖ్యానములు చేసినను ఇస్లాం స్వచ్ఛమైన బోధన వెలుగులో ఇస్లాం రక్షణకు మన కార్యక్రమాలను మేము చేసుకుంటూ పోతాము. చేస్తున్నాము కూడ. ఇన్ షా అల్లాహ్.

ఇక్కరిని, ఇద్దరిని లేదా నలుగుర్ని హత్య చేయడంతో తాత్కాలిక ఉద్రేకము తగ్గిపోవును. కాని శాశ్వత పరిష్కారము లభించదు. శాశ్వత పరిష్కారము కావాలంటే ముస్లిములందరు ఏకము కావలసిన అవసరమున్నది. ఇప్పుడు కూడ ఫ్రాన్స్ అధ్యక్షునికి సమాధానంగా టర్కీ అధ్యక్షుడు సమాధానిమచ్చాడు లేదా ఒకటి రెండు దేశములు ప్రతి స్పందించాయి. ముస్లిం దేశాల నాయకులందరు స్పందించనంత వరకు అది ప్రభావము చూపలేదు. టర్కీ మొదలగు దేశాల ప్రతి స్పందన తరువాత నా ఉద్దేశం అదికాదు అని ఫ్రాన్స్ అధ్యక్షుడు తన వ్యాఖ్యానమును మార్చుకున్నాడు లేదా కొంత తగ్గించుకున్నాడని చెప్తున్నారు. కాని ఒకవైపు నా ఉద్దేశం అది కాదు అంటూనే పైగా మేము చేస్తున్నదే సరైనది అని కూడ తన ప్రకటనకు బలాన్ని చేకూర్చినాడు. 56 ముస్లిం దేశములు ముక్తకంఠంతో స్పందించినచో అది కాదు ఇది, ఇది కాదు అది అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ప్రకటన చేసేవాడు కాదు. పైగా ఫ్రాన్స్ అధ్యక్షుడు విధి లేక మోకాళ్లపై పడి క్షమాపణ కోరేవాడు.

ఏదిఏమైనప్పటికి ఇక్కడ నేను సంక్షిప్తంగా చెప్పదలచినదేమనగా ముస్లిం దేశములు కనీసం ఇతరుల ముందు ఐక్యతతో మాట్లాడండి. అప్పుడు చూడండి ఎంత ప్రభావము చూపుతుందో. మేము మా పని చేస్తున్నాము, చేసుకుంటూ పోతాము. ఇన్ షా అల్లాహ్. ముహమ్మదీయ మసీహ్‌ని విశ్వసించేవారి బాధ్యత ఇది. ఇస్లాం అందమైన బోధనను ప్రపంచములో వ్యాపింపజేయుట వీరి కర్తవ్యము. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అందమైన ముఖమును ప్రపంచానికి చూపుట, ప్రపంచము మొత్తం హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పతాక నీడన చేరనంత వరకు వీరు నిశ్చింతగా కూర్చోలేరు. ఏకైక దేవుణ్ణి గుర్తించి హింసలకు స్వస్తి పలుకుటలోనే మీ మనుగడ గలదని ప్రజలకు చెప్పండి. కొంత కాలము క్రితం అనగా కొన్ని నెలల క్రితం ఇదే కోవిడ్ కాలములో నేను కొన్ని దేశాధ్యక్షులకు ఉత్తరములు వ్రాశాను. అందులో భాగంగా ఫ్రాన్స్ అధ్యక్షునికి కూడ లేఖ వ్రాసను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పదములలో ఇట్లు హెచ్చిరించాను కూడ. హింసల వలన ఈ శిక్ష, విపత్తులు సంభవిస్తున్నవి. కావున మీరు ఇటు వైపు దృష్టి సారించవలెను. దౌర్జన్యములను వీడుము, న్యాయమును స్థాపించుము, సత్యమైన ప్రకటనలు చేయుము. మేము మా కర్తవ్యమును నెరవేర్చాము, నెరవేరుస్తుంటాము. దానిని అర్థము చేసుకొనుట లేదా గ్రహించకపోవుట వారి ఇష్టము. కాని ఎట్టి పరిస్థితిలో మనము ముస్లిం సమాజము కొరకు దుఆలు చేయుటను మరచిపోకూడదు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడిని గుర్తించుటకు అల్లాహ్ తఆలా వారిని అనుగ్రహించుగాక! ఇటువంటి విషయములకు పాల్పడి దేవునితో దూరమైనచో వారికి వినాశనము తప్ప ఏమియును లభించదని వారు గుర్తుంచుకోవలెను. ప్రపంచాన్ని దైవ ఏకత్వము మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పతాకము నీడ క్రిందికి తీసుకవచ్చుటకు మనం అధికముగా ప్రయత్నించాలి. తహ్‌రీకె జదీద్ ఉద్దేశము కూడ ఇదియే. ఇందుకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! ఇంకా ప్రపంచ సాధారణ పరిస్థితుల కొరకు సైతం దుఆలు చేయండి. చాలా వేగంగా వినాశనము వైపు వెళ్తున్నారు. ఈ మహమ్మారి నుండి మోక్షము లభించిన తర్వాత, ప్రపంచ యుద్ధ రూపంలో మరో విపత్తులో చిక్కుకోడదని దుఆలు చేయగలరు. ప్రపంచీకులకు అల్లాహ్ తఆలా తెలివి తేటలు ప్రసాదించుగాక! ఏకైక దేవుణ్ణి గుర్తింతురు గాక! అతని హక్కులను చెల్లింతురు గాక!

----ఖుత్బా సానియా---

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9493113322
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: badartel001@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516
POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 5. Thursday, 10 DEC 2020 Issue No. 50.

MANAGER
SHAIKH MUJAHID
Mobile. : +91 9915379255
e-mail:managerbadrqnd@gmail.com
website:www.akhbarbadarqadian.in
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.500/- (Per Issue: 9/- ) (WEIGHT: 20-50, grms / issue)

(పేజి నెం 2 తరువాత)

మీ పై వారికి గల హక్కులను మీరు తప్పక నెరవేర్చుటకు శ్రద్ధ చూపుము. ఒకరికి మరొక వ్యక్తితో సన్నిహిత్యం ఉన్నప్పుడు అతని హక్కులను వారు నెరవేర్చుటకు ప్రయత్నించవలెను. ”

(మల్ఫూజాత్ సంపుటి2, పుట 262)

మరల వారిట్లు తెల్పిరి: “ దేవుని మార్గములో తన జీవితంను అర్పించుటయే సరైన ఇస్లాం ధర్మము. ఇది రెండు విధాలుగా నెరవేరును. మొదటిది: కేవలం అల్లాహ్ తాలానే అసలైన దైవముగా, లక్ష్యముగా, అభిమానిగా స్వీకరించవలెను.”

రెండవ విధానం గూర్చి తెల్పుచూ మరల వారిట్లనిరి: “ రెండవది దేవుని మార్గములో తన జీవితంను అర్పించు రెండవ విధానం ఏమిటనగా, అతని దాసులకు సేవ చేయడం, వారి పట్ల సానుభూతి చూపడం, వారి మంచి చెడులను తెలుసుకోవడం, వారితో బంధుప్రీతిని కల్గి ఉండడం, వారి స్వచ్ఛమైన శ్రేయోభిలాషిగా వ్యవహరించడంకోసం తమ జీవితంను అర్పించడం. ఇతరులకు సౌకర్యము కల్పించుటకు కొంత వరకు కష్టమును భరించవచ్చును. ఇతరులకు సు:ఖమును కల్పించడము కోసం కొన్ని బాధలను ఓర్చుకోనవచ్చును. ”

(ఆయినా కమాలాతే ఇస్లాం, రూహాని ఖజాయిన్ సంపుటి 5, పుట 60)

మరల వారిట్లు తెల్పిరి: “ మానవ అనవరాలను దృష్టి యందుంచుకొని అందుకు తగినట్లుగా సేవచేయవలెను. వివిధ కారణాలు, అనేక మార్గాలు ఏ విధముగానైతే ఒకరిని మరొకరికి చేయుత నిచ్చుకోవడానికి అనుగుణముగా రూపకల్పన చేసినట్లుగా ఆయా మార్గలన్నింటిలో కేవలం దైవానుగ్రహం కోసం స్వచ్ఛతతో, నిస్వార్థముగా, నిజమైన సానుభూతితో తమకు సాధ్యమైనంత వరకు ఇతరులకు ప్రయోజనంను చేకూర్చాలి. అదే విధముగా ప్రతి నిస్సహాయుడికి తమ శక్తి సామార్థ్యముల మేరకు సహాయంను అందించాలి. అంతేగాకా వారి ఇహ, పర లోకములను సంస్కరించుకొనుటకు వారిని ప్రోత్సహించాలి.” (ఆయినా కమాలాతే ఇస్లాం, రూహాని ఖజాయిన్, సంపుటి 5, పుట 61-62)

మానవజాతి సంస్కరణ మరియు వారి పట్ల సానుభూతి చూపు విషయంలో వారి (అ) ఆవేదనను ఎవరు అంచన వేయలేకుండిరి. పంజాబ్‌లో ప్లేగ్ వ్యాధి ప్రభలుచున్న కాలంలో అనేకులు ఆ వ్యాదికి గురి అయ్యి మరణించసాగిరి. అలాంటి పరిస్థితిలో వారి (అ) సానుభూతి ఎలా ఉండెనో ఒక్కసారి చూడండి. ఈ విషయంను గూర్చి హజ్రత్ మౌలాన అబ్దుల్ కరీం సయాల్కొటి (ర) ఈ విధముగా వెల్లడించిరి. వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఏకాంతంలో దుఆ చేయుచుండగా చూసిరి, వినిరి. ఆ దృశ్యాన్ని చూసి వారు ఆశ్చర్యమునకు గురి అయిరి. వారిట్లు తెల్పిరి:

“వారు (అ) ఆ దుఆ చేయుచున్నప్పుడు బాధ, ఆవేధన భరితమైన వారి స్వరం వినే వారి కాలేయం కరిగిపోవునట్లుండెను. ఒక మహిళ ప్రసవ సమయంలో పురిటి నొప్పులతో ఎంతగా బాధ పడునో అంతకన్న అధికముగా వారు అల్లాహ్ తాలా సన్నిధిలో తమ బాధను వ్యక్త పర్చసాగిరి. నేను ఎంతో శ్రద్ధతో వారి దుఆ పదాలను ఆలకించగా వారు ప్లేగ్ వ్యాధి నుండి ప్రజలను కాపాడమని దుఆ చేయుచుండిరి. ఓ అల్లాహ్! ఒకవేళ ఈ ప్రజలు ప్లేగ్ వ్యాదికి గురిఅయ్యి మరణించినచో ఈ భూమండలంపై నిన్ను ఎవరు ఆరాధిస్తారు? అని దుఆ చేయసాగిరి.”

(సీరతే తయ్యబా, పుట 54, సేకరణ: సీరత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం షమాఇల్ వ ఇఖ్లాఖ్, భాగం 3, పుట 395, రచయిత షేక్ యాకూబ్ అహ్మద్ ఇర్ఫాని రజియల్లాహ్ అనుహు)

మరల వారిట్లు తెల్పిరి: “ తన వలన ఇతరులకు ప్రయోజనం చేకూర్చాలని ఆశించే వారు తమ హృదయంలో ఎలాంటి కపటమును కల్గిఉండరాదు అనునది సత్యం. ఒకవేళ అతనిలో కపటము ఉన్నచో అతడు ఇతరులకు ఎలా ప్రయోజనం చేకూర్చును?. తన మనస్సుకు, తన ఆలోచనలకు భిన్నముగా ఏదేని సంఘటణ చోటు చేసుకున్నచో అతడు ప్రతీకారం తీర్చుకొనుటకు ప్రయత్నించును. కాని ప్రయోజనం చేకూర్చు వారు ఎలా ఉండవలెననగా కొన్ని వేల విధాలుగా అతనిని హత మార్చుటకు ప్రయత్నించినను అతడు భయపడకుండ ఉండవలెను.

నా ఉపదేశమేమనగా రెండు విషయాలను ఎల్లప్పుడు గుర్తుంచుకొనుము. మొదటిది: దేవునికి భయపడుము. రెండవది, నీ కోసం నీవు ఆశించునంత సానుభూతిని నీ సోదరుల పట్ల చూపుము. ఒకవేళ ఎవరితోనైన ఏదేని తప్పిదము లేదా పొరపాటు జరిగినచో వారిని క్షమించుటకు ప్రయత్నించుము. అంతేగాని ఆ విషయంపై అతిగా ఆలోచిస్తూ, ప్రతీకార చర్యలకు పాల్పడకూడదు.

తనకు ప్రతికూలముగా ఏమి జరగకూడదని మానవ స్వభావం ఆశించును. అది ఎంతగా ఆశించుననగా ఏకముగా దేవుని సింహాసనమునే అధిష్టించు నంతగా ఆశించును. అందుకోసమే అట్టి ఆశా భావాల నుండి దూరముండుము. దానుల పట్ల పూర్తి సులక్షణముగా వ్యవహరించడం కూడ ఒక మరణం లాంటిందే అని నేను మీకు వాస్తవాన్ని తెల్పుచున్నాను. ఒకవేళ ఎవరైన ఎవరినైన ఏమైన అనినచో అతని వెంట పడడంను నేను ఇష్టపడను. ఒకరు మరొకరిని దూషించినను, మొదటి వ్యక్తి సహనం పాటిస్తూ నిశబ్ధముగా ఉండడంను మాత్రమే నేను ఇష్టపడెదను.”

(మల్ఫూజత్ సంపుటి 5, పుట 69).

మరల వారిట్లు తెల్పిరి: “ఒక రోజు నేను నడకకు వెళ్ళినప్పుడు అబ్దుల్ కరీం అనే ఒక సేవకుడు నాతో పాటు వచ్చెను. అతడు నాకన్న ముందుకు కొంత దూరము వెళ్ళగా, నేను అతని వెనుక నడుసున్నాను. మార్గ మధ్యలో 70, 75 సంవత్సరాల వృద్ధురాలు కనిపించెను. ఆమే ఒక ఉత్తరమును అతనికి ఇస్తూ దానిని చదివి వినిపించమని ప్రాధేయపడింది. కాని అతడు ఆమేను ప్రక్కకు వెళ్ళమని చీదరించుకొనెను. అట్టి చర్యతో నా హృదయం తల్లడిల్లిపోయినది. ఆ తరువాత ఆ వృద్ధురాలు ఆ ఉత్తరమును నాకు ఇవ్వగా, నేను దానిని తీసుకొని నిలబడి, ఆ ఉత్తరమును పూర్తి చదివి వినిపించాను. ఫలితముగా ఆ సేవకుడు చాలా సిగ్గు పడెను. ఎందుకనగా అతడు నిలబడినాడు, కాని పుణ్య ఫలమును చేజార్చుకున్నాడు. ”

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 305).

(రాబోవు సంచికలో చదవగలరు).

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz